

నేడే విజయదశమి

● కిటకిటలాడనున్న అమ్మవారి ఆలయాలు (8లో..)



పాతూరులో పండుగ సామగ్రి కొనుగోలు చేస్తున్న జనం



పారదర్శకంగా పథకాలు

● 99 శాతం పింఛన్ల పంపిణీ : కలెక్టర్

● అక్రమాలకు చెక్ : ఎమ్మెల్యే

అనంతపురం క్రైం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పింఛన్ల పంపిణీతో పాటు, సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌తో కలసి బుధవారం నగరంలో పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. రాజేంద్ర మున్సిపల్ స్కూల్ వద్ద లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 2.79 లక్షల పింఛన్‌దారులకు రూ. 124.77 కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. 99 శాతం పింఛన్లను లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి అందజేశామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అక్రమాలకు చెక్ పెడుతూ కొత్త పింఛన్లు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ బాలస్వామి, డిప్యూటీ కమిషనర్ పావని, డీఈ నరసింహ నాయకులు పాల్గొన్నారు.



పింఛన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యే దగ్గుపాటి

రూ.118.62 కోట్లు పంపిణీ

అనంతపురం అర్బన్(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 2,79,933 మంది లబ్ధిదారులకు అక్టోబరులో రూ. 124.78 కోట్లు పింఛన్ సొమ్ము మంజూరు చేశారు. బుధవారం 2,66,928 మంది లబ్ధిదారులకు రూ.118.62 కోట్లు పింఛన్ పంపిణీ చేశారు. అక్టోబరు 2న సెలవు కావడంతో తొలిరోజు పింఛన్ తీసుకోని వారు స్థానిక సచివాలయాల్లో 3న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సొమ్మును పొందాలని డీఆర్‌డీఏ పీడీ శైలజ సూచించారు.

ఘనంగా ఆయుధపూజ

● ప్రత్యేక పూజలు చేసిన ఎస్పీ జగదీష్



ఆయుధాలకు పూజ చేస్తున్న ఎస్పీ

అనంతపురం క్రైం, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని ఆయుధాగారంలో బుధవారం ఆయుధ పూజ ఘనంగా చేశారు. ఆయుధాలను ప్రత్యేకంగా అలంకరించి, దుర్గాదేవి చిత్రపటం ఉంచి పూజలు చేశారు. ఎస్పీ జగదీష్ ముఖ్య అతిథిగా హాజరై ఆయుధాగారంలో పూజలు నిర్వహించారు. మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగానికి వెళ్లి, పోలీసులు వినియోగించే ద్విచక్ర వాహనాలు, కార్లు, వాటర్ కేనన్స్, వజ్ర వాహనాలకు పూజలు చేశారు. డీపీఓలో కొత్తగా ఏర్పాటు చేసిన ఫిరంగి, పోలీస్ పెట్రోల్ బంకుల వద్ద ఆయుధ పూజ చేశారు. ఏఎస్పీ ఇలియాస్ బాషా, డీఎస్పీలు శ్రీనివాస్‌రావు, వెంకటేశ్వర్లు, డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



విజయానికి ప్రతీక దసరా

● ప్రజలకు మంత్రి, కలెక్టర్, ఎస్పీ శుభాకాంక్షలు

అనంతపురం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): చెడుపై మంచి, దుష్టశక్తులపై దైవశక్తి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి పండుగ అని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ జగదీష్ అన్నారు. జగన్మాత ఆశీస్సులతో ప్రజలంతా సుఖశాంతులు, సిరి సంపదలతో తులతూగాలని, ప్రతి ఒక్క కుటుంబానికి విజయాలు కలగాలని ఆకాంక్షించాలన్నారు. జిల్లా ప్రజలందరికి మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ జగదీష్ దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.














అయ్యో.. రామక్రిష్ణా..!

- గురుకుల ప్రిన్సిపాల్‌గా ఎంపిక.. తుది జాబితాలో పేరు
- ఆలస్యంగా గుర్తింపు..
- డీఈఓ కార్యాలయానికి పరుగు



తుది జాబితాలో తన పేరు చూపుతున్న రామక్రిష్ణ

అనంతపురం విద్య, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నియామకాలలో విద్యాశాఖ తప్పిదాలు వెలుగులోకి వస్తున్నాయి. రామక్రిష్ణ అనే వ్యక్తి ప్రస్తుతం స్కూల్ అసిస్టెంట్‌గా కూడేరు మండలంలో పనిచేస్తున్నారు. ఇటీవల జరిగిన డీఎస్సీ-2025 నియామకాలలో మోడల్ స్కూల్స్, గురుకులాల ప్రిన్సిపాల్ పోస్టుకు వీహెచ్ (అంధత్వం) కేటగిరి కింద దరఖాస్తు చేసుకొని పరీక్ష రాశారు. రాష్ట్రస్థాయిలో 573వ ర్యాంకులో నిలిచారు. వీహెచ్ కోటా కింద మోడల్ స్కూల్స్‌లో ప్రిన్సిపాల్ పోస్టు వస్తుందని ఆశించారు. ఆ పోస్టు జాబితా మాత్రమే చూసుకుంటూ ఇతర యాజమాన్యం ప్రిన్సిపాల్ పోస్టుల గురించి ఆలోచించలేదు. రామక్రిష్ణ వీహెచ్ కోటా కింద రాష్ట్రస్థాయిలో గురుకులాల (ఏపీఆర్ఈఐఎస్) ప్రిన్సిపాల్ పోస్టుకు ఎంపికైనట్లు రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసిన తుది జాబితాలో పేరు ఉంది. వేరే జిల్లాకు చెందిన ఆయన మిత్రుడు ప్రిన్సిపాల్‌గా ఎంపికయినా వెరిఫికేషన్‌కు ఎందుకు రాలేదని అడిగారు. అపుడు రామక్రిష్ణ ఎంపిక జాబితాను చూసుకున్నాడు. అందులో తుది ఎంపిక జాబితాలో తనపేరు ఉండడంతో ఖంగుతిని బుధవారం డీఈఓ కార్యాలయానికి పరుగున వచ్చారు. ఇక్కడి డీఎస్సీ సెక్షన్‌లో అధికారులను కలిసి తాను ఎంపికైనట్లు ఎలాంటి సమాచారం రాలేదని, తనకు జరిగిన అన్యాయం వివరించాడు. తనకు న్యాయం చేయాలని, లేదంటే తనకు ఎలాగో ఉద్యోగం ఉందని, అర్హత ఉన్న ఇంకో అభ్యర్థికయినా ఆ పోస్టు ఇవ్వాలని కోరారు. ఇది రాష్ట్రస్థాయి పోస్టు అని, ఈ పోస్టు ఎంపిక రాష్ట్ర స్థాయిలోనే జరిగిందని, అక్కడికే వెళ్లి కలవాలని విద్యాశాఖ అధికారులు ఉచిత సలహా ఇచ్చి పంపించారు. ఇప్పటికే నియామకాల ప్రక్రియ ముగిసింది. 3వ తేదీ నుంచి కొత్తటీచర్లకు శిక్షణ ఇస్తున్నారు. ఇపుడు ఈయన గోడు వినేదేవరు.. అంటూ అక్కడ ఉన్నవారు అయ్యో .. రామక్రిష్ణా.. అని సానుభూతి తెలిపారు.



పండుగ సామగ్రి కొనుగోలు చేస్తున్న జనం





కిక్కిరిసిన జనంతో పాతూరులోని ఓ వీధిలో స్తంభించిన ట్రాఫిక్

నేడే విజయదశమి

కిటకిటలాడనున్న అమ్మవారి ఆలయాలు



అనంతపురం టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా విజయదశమి పండుగను గురువారం ఘనంగా జరుపుకోనున్నారు. శక్తి ఆరాధనకు ప్రాధాన్యమిచ్చే పండుగ కావడంతో గత పది రోజులుగా అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి, పూజించారు. పండుగ నేపథ్యంలో పూలు, పూజా సామగ్రి కొనుగోళ్లతో దుకాణాలు బుధవారం కిటకిటలాడాయి. అలాగే ప్రజల షాపింగ్‌లతో అనంతపురం నగరంలో సందడి నెలకొంది. పూలు, పండ్లు, మామిడాకులు, టెంకాయలు, అరటి పిలకలు తదితర సామగ్రి కొనుగోళ్ల నేపథ్యంలో పాతూరు, క్లాక్‌టవర్ ప్రాంతాల్లో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. దీంతో ట్రాఫిక్ స్తంభించి పోయింది. ఆయుధపూజ సందర్భంగా బుధవారం ఉదయం వాహనాలు, యంత్రాలతోపాటు వ్యవసాయ పరికరాలకూ పూజలు నిర్వహించారు. విజయదశమి నేపథ్యంలో నేడు అమ్మవారి ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడనున్నాయి.

ఏడేళ్లకే అంతర్జాతీయ ర్యాంకు



రతన్‌తేజ్

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏడేళ్ల వయసులోనే తాడిపత్రికి చెందిన రతన్‌తేజ్ అంతర్జాతీయ స్థాయి చెస్‌లో ర్యాంకు సాధించాడు. గత రెండేళ్లుగా చెస్ ఆడుతున్న రతన్‌తేజ్ ఇంటర్నేషనల్ ఫిడే క్లాసికల్ విభాగంలో అండర్-17 బాలుర కేటగిరీలో 1470ర్యాంకు సాధించాడు. ప్రపంచ చదరంగసమాఖ్య, అఖిలభారత చదరంగ సమాఖ్యలు సంయుక్తంగా బుధవారం విడుదల చేసిన రేటింగ్‌లో రతన్ తేజ్‌కు ఉమ్మడి జిల్లాలోనే అత్యుత్తమ ర్యాంకు దక్కింది. దీంతో రతన్‌తేజ్‌ను ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బాలరాజు, అధ్యక్షుడు శివకుమార్, కోశాధికారి కిశోర్‌కుమార్ నాయుడు, ఇంటర్నేషనల్ ఆర్బిటార్ ఉదయ్‌కుమార్ నాయుడు అభినందించారు.

4న జిల్లాస్థాయి ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14, 17, 19 బాల, బాలికలకు వెయిట్ లిఫ్టింగ్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలు ఈనెల 4న అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. అదే రోజు నారాయణ టెన్నిస్ అకాడమీలో సాఫ్ట్‌టెన్నిస్ ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, యూనిఫాం, క్రీడాసామగ్రితో హాజరు కావాలన్నారు. వివరాలకు సెల్ నంబరు 7989737474ను సంప్రదించాలని కోరారు.

• ఒకే చెట్టుకు రెండు గెలలు



ఒకే చెట్టులోని రెండు గెలలు

పుట్లూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): అరటిచెట్టుకు సాధారణంగా ఒక గెల వస్తుంది. అయితే మండలంలోని రంగరాజుకుంట గ్రామానికి చెందిన రైతు హనుమంతరెడ్డి తోటలో ఒకే చెట్టుకు రెండు గెలలు వచ్చాయి. ఈ విషయం తెలుసుకున్న మిగతా రైతులు తోటవద్దకు వెళ్లి ఆసక్తిగా గెలలను చూస్తున్నారు. ఉద్యాన శాఖ అధికారులు మాట్లాడుతూ కాండం ఏర్పడిన సమయంలో రెండు అరటిగెలలు వచ్చి ఉంటాయని తెలిపారు. కాగా హనుమంతరెడ్డి ఐదెకరాల్లో అరటి పంటను సాగు చేశాడు.

ఇళ్ల పేరుతో కోట్లు దోపిడీ

- ప్రకాశ్‌రెడ్డిపై ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం
- లబ్ధిదారులకు పింఛన్లు, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



స్మార్ట్ రేషన్‌కార్డు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్లు నిర్మిస్తామని కోట్ల రూపాయల అవినీతి చేసిందే కాకుండా ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నావా అంటూ మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని దుబ్బార్లపల్లిలో పింఛన్లు, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో ఆమె పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి పింఛన్లు, స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే అంత తోపు అయితే ఐదేళ్లలో ఇళ్లు ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. రాక్రిట్ సంస్థ పేరుతో గత ప్రభుత్వంలో జరిగిన దోపిడీ వందల కోట్లలో ఉందన్నారు. దీనిపై ఇప్పటికే అధికారులు నివేదిక ఇచ్చారని, త్వరలో చర్యలు ఉంటాయన్నారు. నెలకు ఒకసారి వచ్చి కార్యకర్తలు, నాయకులను రెచ్చగొట్టి వెళుతున్నాడని అన్నారు. డిజిటల్ బుక్కులకు, బెదిరింపులకు భయపడేదిలేదని తెలిపారు. వీళ్ల మాటలు నమ్మితే అమాయక నాయకులు, కార్యకర్తలు కేసుల్లో ఇరుక్కొని ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు. ఆమె వెంట స్థానిక నాయకులు అధికారులు పాల్గొన్నారు.

4న పారా స్విమ్మింగ్ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జూనియర్, సబ్‌జూనియర్ పారా స్విమ్మింగ్ బాల, బాలికల క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 4న నిర్వహించనున్నట్లు జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు తెలిపారు. ఆసక్తి, అర్హతగల పారా స్విమ్మింగ్ క్రీడాకారులు ఈనెల 4న అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకుని, ఎంపిక పోటీలకు హాజరుకావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి పారా స్విమ్మింగ్ పోటీలకు అర్హులన్నారు. వివరాలకు 9390388169, 8074106154 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి

- అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ ఎదుట నిరసన



నిరసనకు దిగిన స్థానిక యువకులు

యాడికి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ కమలపాడు గ్రామానికి చెందిన పలువురు నిరుద్యోగ యువకులు బుధవారం మండలంలోని బోయరెడ్డిపల్లి వద్ద ఉన్న అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ మెయిన్‌గేట్ వద్ద నిరసనకు దిగారు. వారు మాట్లాడుతూ మండలంలో రెండు సిమెంట్ పరిశ్రమలు, ఒక సోలార్ ప్రాజెక్ట్ ఉన్నాయన్నారు. ప్రస్తుతం మరో సోలార్ ప్రాజెక్ట్ కూడా ఏర్పాటవుతున్నా మండలంలోని యువకులకు ఉపాధి అవకాశాలు లభించక ఇబ్బంది పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల స్థాపన సమయంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీలు ఇచ్చి, తర్వాత విస్మరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో నిరుద్యోగ యువతకు వలసలు తప్పడం లేదని పేర్కొన్నారు. యాజమాన్యాలు తగు చర్యలు చేపట్టి అర్హత కలిగిన స్థానిక యువకులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాకాని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

చెట్టు కింద పింఛన్

- ఇబ్బందిపడ్డ వృద్ధులు, దివ్యాంగులు




చెట్టు కింద పింఛన్ పంపిణీ చేస్తున్న సిబ్బంది, టీడీపీ నాయకులు

బొమ్మనహాళ్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికి తిరిగి పంపిణీ చేయకుండా అందరినీ ఓ చెట్టు వద్దకు రప్పించి పింఛన్ పంపిణీ చేసిన సంఘటన మండలంలోని ఉంతకల్లు గ్రామంలో బుధవారం జరిగింది. సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంతో గ్రామంలోని ముళ్ల చెట్టు కింద వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్ పంపిణీ చేశారు. దీంతో వృద్ధులు , దివ్యాంగులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. చెట్టు కింద కూర్చోవడానికి కూడా లేకపోవడంతో చాలా సేపు నిలబడాల్సిన వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చర్యలు తీసుకుని వచ్చే నెల నుంచైనా ఇంటి వద్దనే పింఛన్ పంపిణీ చేయించాలని వారు విన్నవించారు.

ఇంటి వద్దే ఇవ్వాలి: విజయభాస్కర్, ఎంపీడీఓ, బొమ్మనహాళ్

మండలంలో పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు ఇంటి వద్దకు వెళ్లి పంపిణీ చేయాల్సిందే. అలాకాకుండా అందరినీ ఒకచోటకు రప్పించి పంపిణీ చేస్తే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా గ్రామాల్లో ఒకే చోట పంపిణీ చేస్తుంటే మా దృష్టికి తేవాలి. ఉంతకల్లులో జరిగిన విషయం నా దృష్టికి రాలేదు. సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.

15 దాకా ఈ పంట నమోదు గడువు



అనంతపురం అర్బన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ ఈ పంట నమోదు గడువును ఈనెల 15 దాకా పొడిగించారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి మౌఖిక ఆదేశాలు జారీ అయ్యాయి. ఇదివరకు సెప్టెంబరు నెలాఖరు దాకా ఈ పంట నమోదుకు గడువు ఉండేది. క్షేత్ర స్థాయిలో ఈ పంట నమోదు మందకొడిగా సాగుతుండటంతో ఈనెల 15 వరకు పొడిగించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి.

మాది రైతు పక్షపాత ప్రభుత్వం

- ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్
- వ్యవసాయ రంగానికి జీఎస్టీ తగ్గింపుపై హర్షం
- నగరంలో ట్రాక్టర్ ర్యాలీ



పచ్చజెండా ఊపి ట్రాక్టర్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు, డీసీఎంఎస్ చైర్మన్ వెంకటేష్

అనంతపురం అర్బన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్డీయే ప్రభుత్వం రైతు పక్షపాతిగా పని చేస్తోందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో జీఎస్టీ తగ్గింపుపై హర్షం వ్యక్తం చేస్తూ వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో బుధవారం అనంతపురంలో రైతులు ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల ఎగ్జిబిషన్ మైదానం నుంచి సప్తగిరి సర్కిల్ దాకా ఈ ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే దగ్గుపాటి, ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, ఏపీ వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ స్వప్న హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల వ్యవసాయ రంగం అత్యధిక ప్రయోజనం పొందుతోందన్నారు. ఐదారు రోజుల్లో వందల సంఖ్యల్లో ట్రాక్టర్లు కొనుగోలు చేశారన్నారు. వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు తదితరాలపై గతంలో 12 శాతం ఉన్న జీఎస్టీని 5 శాతానికి తగ్గించడం రైతులకు ఎంతో ఊరట కలిగిస్తోందన్నారు. గతంలో డ్రిప్ పరికరాలపై 18 శాతమున్న జీఎస్టీని 5 శాతానికి తగ్గించారన్నారు. ఇందులో 2.5 శాతం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోందన్నా రు. ఈ ఏడాదిలో లక్ష ఎకరాలకుపైగా డ్రిప్, స్ప్రింక్లర్లు అందించినట్లు వెల్లడించారు. కరువు జిల్లాను హార్టికల్చర్ హబ్ గా మార్చిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి, ఉద్యాన శాఖ జిల్లా అధికారి ఉమాదేవి, అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్, డ్వామా పీడీ సలీంబాషా, ఏపీడీ సుధాకర్ రెడ్డి, డ్వామా విజిలెన్స్ అధికారి శ్రీనివాసులు, ఏఓలు వెంకట్‌కుమార్, రాకేష్‌నాయక్, వంశీకృష్ణ, సోమశేఖర్, శ్యాంసుందర్‌రెడ్డి, టీడీపీ నాయకులు తలారి ఆదినారాయణ, మూర్తి, పరమేశ్వరన్, సింగవరం రవి, సుధాకర్ యాదవ్, ఇస్మాయిల్, రైతులు పాల్గొన్నారు.

రేపటి నుంచే శిక్షణ

- హాజరుకానున్న 1476 మంది కొత్త టీచర్లు
- మూడు ప్రాంతాల్లో వేదికల ఏర్పాటు
- వసతులపై ఆరాతీసిన కలెక్టర్ ఆనంద్



శిక్షణ ఏర్పాట్లపై డీఈఓ, ఏపీసీతో ఆరాతీస్తున్న కలెక్టర్

అనంతపురం విద్య, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025లో ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులకు శుక్రవారం నుంచి శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఈ శిక్షణ తరగతులను వారంపాటు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇందుకోసం జిల్లాకేంద్రంలో మూడు ప్రాంతాలలో వేదికలను విద్యాశాఖ, ఎస్ఎస్ఏ శాఖలు ఏర్పాటు చేశాయి. వివేకానంద జూనియర్ కళాశాల(పంగల్‌రోడ్డు), ప్రభుత్వ ట్రైనింగ్ రీజినల్‌సెంటర్ (క్రొరపాడు, బీకేఎస్), విజయభారతి డీఎడ్ కళాశాల (బీకేఎస్)లో శిక్షణ తరగతులను రెసిడెన్షియల్ పద్ధతిలో నిర్వహించనున్నారు. ఈశిక్షణకు 1476మంది హాజరవుతారని అధికారులు తెలిపారు. అనంత జిల్లా నుంచి 753మంది ఉండగా, కర్నూలు జిల్లాకు చెందిన 723మందికి ఇక్కడే శిక్షణ ఇవ్వనున్నారు. విజయభారతి, ప్రభుత్వ రీజినల్‌ట్రైనింగ్‌సెంటర్ ఒక్కో సెంటర్ ఉండగా, వివేకానంద జూనియర్ కళాశాలలో నాలుగు సెంటర్లను ఏర్పాటు చేశారు. ఏ ఉపాధ్యాయుడు ఏ సెంటర్‌కు వెళ్లాలో ఇప్పటికే సమాచారం పంపా రు. డీఈఓప్రసాద్‌బాబు, ఏపీసీ శైలజ శిక్షణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

కొత్తటీచర్లకు శిక్షణా తరగతులు నిర్వహించే కేంద్రాలను కలెక్టర్ ఆనంద్ బుధవారం పరిశీలించారు. విజయభారతి డీఎడ్ కళాశాలను తనిఖీ చేశారు. అక్కడున్న వసతులు పరిశీలించారు. ఎంతమంది టీచర్లు వస్తున్నారు? వారందరికీ సరిపడా సౌకర్యాలు ఉన్నాయా అని అక్కడి అధికారులతో ఆరా తీశారు. కొత్త టీచర్ల శిక్షణాతరగతులను నిబంధనల మేరకు పక్కాగా నడపాలన్నారు. వసతులు, మెనూ విషయంతో లోపాలు లేకుండా చూడాలని, ఏమైనా ఇబ్బందులు ఏర్పడితే తన దృష్టికి తీసుకురావాలని డీఈఓ, ఏపీసీలకు కలెక్టరు సూచించారు.

వందశాతం హాజరుకావాలి: డీఈఓ

కొత్తటీచర్లు వందశాతం శిక్షణాతరగతులకు హాజరుకావాలని, ఎవరికీ మినహాయింపు ఉండదని డీఈఓ ప్రసాద్ బాబు పేర్కొన్నారు. శిక్షణకు సంబంధించిన వివరాలను బుధవారం ఆయన వెల్లడించారు. శిక్షణ తరగతులు ఈనెల 3 నుంచి పదో తేదీవరకు ఉంటాయన్నారు. టీచర్లు శుక్రవారం ఉదయం 7గంటలకు కేటాయించిన కేంద్రాలకు వచ్చి రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ప్రతిఅభ్యర్థి ఎంపికైన నియామకపత్రం, లేటెస్ట్ ఆండ్రాయిడ్ ఫోన్, వారానికి సరపడా మందులు(అవసరమైనవారు) దుప్పట్లు, దుస్తులు, వ్యక్తిగత వస్తువులు తెచ్చుకోవాలన్నారు. తమకు కేటాయించిన శిక్షణాకేంద్రాలలోనే తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రస్తుత శిక్షణకు హాజరుకానివారు రాష్ట్రస్థాయిలో ఇచ్చే శిక్షణకు హాజరుకావాల్సి ఉంటుంది. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు మాత్రమే కౌన్సెలింగ్‌లో ప్లేస్‌మెంట్ అపాయింట్‌మెంట్ ఇస్తామని డీఈఓ పేర్కొన్నారు.

రెండు సొసైటీలకు పీఐసీల నియామకం

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రెండు ప్రాథమిక సహకార వ్యవసాయ సంఘాల (సొసైటీ)లకు అధికారిక పర్సన్ ఇన్‌చార్జి(పీఐసీ)లను నియమించారు. ముద్దలాపురం సొసైటీకి అనంతపురం ఎస్‌డీఎల్‌సీఓ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ ఇన్‌స్పెక్టర్ నీరజకుమారిని, వజ్రకరూరు సొసైటీకి గుత్తి ఎస్‌డీఎల్‌సీఓ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ ఇన్‌స్పెక్టర్ సుజాతమ్మను అధికార పర్సన్ ఇన్‌చార్జిగా నియమిస్తూ రాష్ట్ర సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ జీఓ నంబరు 856ను జారీ చేశారు. వీరు వచ్చే ఏడాది జనవరి 30 వరకు పర్సన్‌ఇన్‌చార్జిలుగా కొనసాగనున్నారు.

బాక్సింగ్ జిల్లా జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): బాక్సింగ్‌కు సంబంధించి ఎస్‌జీఎఫ్ (స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్) జిల్లా జట్లను ఎంపిక చేశారు. అండర్-14, 17, 19 బాల, బాలికలకు బాక్సింగ్ జిల్లాస్థాయి సెలెక్షన్స్ బుధవారం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. డీఎస్‌డీఓ మంజుల ముఖ్య అతిథిగా హాజరై, పోటీలను ప్రారంభించారు. ఎంపికైన వారి వివరాలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు వెల్లడించారు.

అండర్-14 బాలుర విభాగంలో..

లక్ష్మీనారాయణ, ఓబులేసు, షెక్షావలి, సమీర్, శివబాలాజీ, రవీంద్ర, మేఘనాథ్, పవన్‌కుమార్, అవినాష్, సందీప్, మహిధర్ ఎంపికయ్యారు.

అండర్-17 బాలికలో..

నందిని, బిందు శ్రీ, గీతాంజలి, సాయిశ్రీ, నీలావతి, ఆశీర్వాద, రేబిక, బిందు, సింధు, వసంత లక్ష్మి, తనూషా, అంజలి, వసంత, మేఘన ఎంపికయ్యారు.

బాలురలో..

హర్షవర్ధన్, మణికంఠ, వైష్ణవ్‌కుమార్ రెడ్డి, రవితేజ, భరత్‌కుమార్, సుదర్శన్, లక్షిత్‌చౌదరి, మనోజ్, చక్రి, విజయ్‌కుమార్, కిశోర్‌నాయక్, ఉమర్ ఎంపికయ్యారు.

అండర్-19 బాలురలో..

నూర్ మహ్మద్, మణికంఠ, తేజ్‌కుమార్, అక్షయ్‌కుమార్, గణేష్, చరణ్, హర్షవర్ధన్‌రెడ్డి, అర్సలామ్, అబీథ్, విజయ్‌సింహా రెడ్డి, నంద కిశోర్ ఎంపికయ్యారు.

బాలికల విభాగంలో..

ప్రత్యూష, హేమావతి, షహీనా, నందిని, అఖిల, రేవతి, భవిజ్ఞ, స్నేహలత ఎంపికయ్యారు. వీరు ఈనెల 5 నుంచి రాజమహేంద్రవరంలో జరిగే ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ క్రీడాపోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పీడీలు శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, శ్రీవాస్‌రెడ్డి, నరసింహారెడ్డి, ప్రభాకర్, గోపాల్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎలా జరిగిందో.. ఏమో?

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


మస్తాన్ వలి(ఫైల్)

అనంతపురం క్రైం, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని క్లాక్ టవర్ ఫ్లైఓవర్ వంతెనపై బుధవారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో తపోవనం ప్రాంతానికి చెందిన దూదేకుల మస్తాన్ వలి(32) దుర్మరణం చెందాడు. అనంతపురం ట్రాఫిక్ పోలీసులు తెలిపిన మేరకు నారాయణపురం పంచాయతీలోని తపోవనానికి చెందిన మస్తాన్ వలి నగరంలోని ఓ షాపింగ్ మాల్‌లో పని చేస్తున్నాడు. భార్య ఆశాతో కలిసి బుధవారం సాయంత్రం ద్విచక్రవాహనంపై నగరంలోకి బయల్దేరాడు. క్లాక్‌టవర్ ఫ్లైఓవర్ వంతెన మధ్యలోకి రాగానే ఎలా జరిగిందో తెలియదు కానీ ఉరవకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కింద మస్తాన్ వలి పడ్డాడు. తలపై నుంచి బస్సు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అదృష్టవశాత్తు అతడి భార్య ప్రాణాలతో బయట పడ్డారు. మస్తాన్ వలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అనంతపురం ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ డాన్‌లు..!

- అనంతలో పేట్రేగిపోతున్న ఇద్దరు
- డీలర్ల నుంచి బియ్యం సేకరణ
- అసోసియేషన్ నాయకులకూ ముడుపులు
- ప్రతినెలా వంద టన్నులు రవాణా
- పౌరసరఫరాల అధికారులకూ ముడుపులు?



అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పేదలకు అందాల్సిన ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యం అక్రమార్కుల పాలవుతోంది. నిత్యం వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకునే దిక్కు లేకుండాపోయింది. తక్కువ ధరకు కొనుగోలు చేసిన ఆ బియ్యం పాలిష్ చేసి, ఇతర ప్రాంతాలకు తరలించి, అధిక ధరలకు విక్రయిస్తున్నారు. రాష్ట్రాలు దాటి విదేశాలకు సైతం ఆ బియ్యం తరలుతోంది. ప్రజల నుంచే కిలోల లెక్కన పీడీఎస్ బియ్యం కొనుగోలు చేస్తుంటారు. టన్నుల లెక్కల్లో డీలర్ల నుంచే అక్రమంగా తరలుతోంది. జిల్లా ఉన్నతాధికారులందరూ ఉన్న అనంతపురం నగరంలో ఈ దందా సాగుతోంది. నగరంలో ఓ ఇద్దరు వ్యక్తులు రేషన్ డాన్‌ల అవతారమెత్తారు. పీడీఎస్ బియ్యం సేకరించి, ఇతర ప్రాంతాల వారికి విక్రయించి రూ.కోట్లకు పడగలెత్తారు. డీలర్ల నుంచి వారికి ప్రతినెలా తప్పనిసరిగా బియ్యం బస్తాలు వెళ్లాల్సిందేనన్న నిబంధన తీసుకొచ్చారు. అలా అమలు చేసినందుకు ఓ అసోసియేషన్‌లో కీలకంగా ఉన్న వ్యక్తులకు నెల మామూళ్లు కూడా వెళ్తాయట. ఇంతస్థాయిలో దందా జరుగుతుంటే పౌరసరఫరాల శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. వారికి కూడా ముడుపులు ముడుతున్నాయనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి.

అనతికాలంలోనే..

అనంతపురం రూరల్ మండల పరిధి ఓ గ్రామం కేంద్రంగా వ్యాపారి కేవలం పీడీఎస్ బియ్యం వ్యాపారమే నిర్వహిస్తున్నాడు. మరో వ్యాపారి విద్యుత్‌నగర్ సర్కిల్ సమీపంలో ఉంటాడు. ఇతనూ అదేస్థాయిలో బియ్యం వ్యాపారం చేస్తున్నాడు. ఈ ఇద్దరూ అనతికాలంలోనే రేషన్ డాన్‌ల అవతారమెత్తారు. పంగల్ రోడ్డులో ఉన్న ఓ వ్యాపారి ఉన్నంత వరకు వీరిద్దరి పేర్లు అంతంత మాత్రంగానే వినిపించేవి. అతడు వ్యాపారం ఆపేసేసరికి ఈ ఇద్దరూ పుంజుకున్నారు. అక్రమ వ్యాపారంలో ఏకంగా కోట్ల రూపాయలు కూడబెట్టారు. వీరికి సంబంధించిన వ్యక్తులు రేషన్‌కార్డుదారుల నుంచే బియ్యం సేకరిస్తుంటారు. కిలో రూ.15 నుంచి రూ.18 చొప్పున కొనుగోలు చేస్తారు. ఇదివరకు తనకు అనుకూలమైన రేషన్ డీలర్ల నుంచే నెలకు 10 నుంచి 20 బస్తాల చొప్పున నేరుగా కొనుగోలు చేసేవాడు. ఈ మధ్యకాలంలో వీరికి బంపర్ ఆఫర్ వచ్చింది. ప్రతి డీలర్ ఆ రేషన్‌డాన్‌కు కనీసం 5 బస్తాలైనా ఇవ్వాల్సిందేనన్న నిబంధన తీసుకొచ్చారట. దీంతో కష్టపడకుండానే అతడి వద్దకు బియ్యం వచ్చి, చేరుతోంది.

డీలర్ల నుంచి బస్తాల బియ్యం

ప్రతి రేషన్ డీలర్.. డాన్‌లకు ఐదు బస్తాలు ఇవ్వాల్సిందే. ఇది కొన్ని నెలలుగా అనంతపురం పరిధిలో వినిపిస్తున్న హెచ్చరిక. ఓ అసోసియేషన్ తరఫున ఇద్దరు వ్యక్తులు చేసిన హుకుంతో డీలర్లందరూ ఆ పని తప్పనిసరిగా చేయాల్సి వస్తోందట. ఇది వరకు కొందరు మాత్రమే అలా విక్రయించేవారు. ఇప్పుడు అందరికీ తప్పనిసరి అయిందని సమాచారం. అనంతపురం పరిధిలో 137, రూరల్‌తో కలిపి 214 వరకు రేషన్ షాపులు ఉన్నాయి. వీటిలో 150 నుంచి 180 పీడీఎస్ ప్యాకెట్లు వచ్చే డీలర్ 5 నుంచి 10 వరకు, 250 నుంచి 300 వరకు ప్యాకెట్లు అందే డీలర్ 25 పీడీఎస్ బస్తాలు అందజేస్తారట. 25 బస్తాలిచ్చే దుకాణాలు నగరంలో, రూరల్‌లో మొత్తం 50కిపైగా ఉన్నట్లు సమాచారం. గతంలో బఫర్ వ్యవహారమంతా ఇదేనని సమాచారం. కిలో రూ.16 నుంచి రూ.18 వరకు డీల్ కుదుర్చుకుంటారని సమాచారం. అంటే 214 దుకాణాల నుంచి సుమారు 2,100 బస్తాల బియ్యం రేషన్‌డాన్‌ల వద్దకు చేరుతోంది. ఇవన్నీ నేరుగా ఆటోలు, ఇతర వాహనాల్లో ఆ ఇద్దరు రేషన్‌డాన్‌ల వద్దకు వెళ్తుంటాయని తెలిసింది. ఆ బియ్యంపై కిలోకు ఇంత పర్సెంటేజీ తీసుకుని కర్ణాటక వ్యాపారులకు విక్రయిస్తుంటారు. వారు అక్కడి నుంచి రూ.40తో ఇతరులకు విక్రయిస్తుంటారని తెలిసింది. అలా ఇతర దేశాలకు ఎగుమతి చేస్తుంటారని సమాచారం.



పంపకాల సంప్రదాయం ఎప్పటి నుంచో..

పీడీఎస్ బియ్యం అక్రమాల వ్యవహారం ఈనాటిది కాదు. అదే రీతిలో అక్రమార్కులు, సంబంధిత అసోసియేషన్ నాయకుల నుంచి అధికార పార్టీ నాయకులకు పంపకాలు వెళ్తుంటాయన్న విమర్శలు లేకపోలేదు. కాంగ్రెస్ హయాం నుంచే ఈ సంప్రదాయం కొనసాగుతోంది. అప్పట్లోనే ప్రతినెలా రూ.1.50 లక్ష అందజేసేవారు. అప్పటి నుంచి ఏ ప్రభుత్వం వచ్చినా అధికార పార్టీలో కీలక నేతలకుగానీ, వారి అనుచరులకుగానీ ఆ డబ్బు ముట్టేది. వైసీపీ హయాంలో అసోసియేషన్ నాయకుడు చెప్పిందే వేదంగా మారింది. రేషన్‌డాన్‌ల నుంచో, సంబంధిత అసోసియేషన్ నాయకుల నుంచో ఈ ముడుపులు అందుతుంటాయి. ఎప్పుడూ రేషన్ డీలర్లు తప్పనిసరిగా రేషన్ డాన్‌లకు బియ్యం సరఫరా చేయాలని హుకుం జారీ చేయలేదని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈసారి ఆ సంప్రదాయం మారిందట. తప్పనిసరిగా ప్రతి డీలర్ ఇవ్వాలని హుకుం జారీ చేశారని వారు వాపోతున్నారు. ప్రస్తుతం కూడా ఓ కీలక వ్యక్తే ఈ వ్యవహారం అంతా తానై నడుపుతున్నట్లు సమాచారం.

సమంగా పంపకాలు...

పీడీఎస్ బియ్యం రేషన్ డాన్‌ల నుంచి కర్ణాటక రాష్ట్రానికి చెందిన వ్యక్తులు కొనుగోలు చేస్తుంటారు. రోజూ క్వింటాళ్ల చొప్పున సరఫరా చేస్తుంటారు. డీలర్లకు కాకుండా అసోసియేషన్‌లో కీలకమైన వ్యక్తులకు అదనంగా కమీషన్ ఇవ్వాల్సి ఉంటుందట. దీంతో ఇక్కడ పీడీఎస్ బియ్యం కిలో కొనుగోలు ధర రూ.24కి చేరుకుంటుంది. ఇక్కడ మరో చిక్కు ఉంది. ఆ అసోసియేషన్‌లో రెండు వర్గాలు అయ్యాయట. ఓ వర్గం అనంతపుర రూరల్ పరిధిలోని రేషన్‌డాన్‌కు, మరో వర్గం విద్యుత్ నగర్ సర్కిల్ సమీపంలోని మరొకరికి డీలర్ల నుంచి బియ్యం సరఫరా చేయిస్తున్నాయట. ఒక్కో డీలర్ నుంచి బియ్యం అందజేసినందుకు రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు కమీషన్ ఉంటుందని సమాచారం. మొత్తం దుకాణాల నుంచి ప్రతినెలా రూ.2.50 లక్షల వరకు ఆదాయం పొందుతున్నట్లు సమాచారం.

పౌరసరఫరాల శాఖ ఏం చేస్తున్నట్లు..?

సామాన్య ఉద్యోగి నుంచి కలెక్టర్ వరకు ఉన్న జిల్లా కేంద్రంలో ఇంత దందా జరుగుతుంటే బాధ్యత కలిగిన పౌరసరఫరాల శాఖ ఏం చేస్తోందనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఈ అక్రమ వ్యవహారం తమ కేమీ తెలియదన్నట్లు ఆ శాఖ అధికారులు వ్యవహరిస్తున్నారు. అనంతపురం, రూరల్ తహసీల్దార్ కార్యాలయాల పరిధిలో కీలక అధికారులు, సంబంధిత డిప్యూటీ తహసీల్దార్లకు ప్రతినెలా పెద్ద మొత్తంలో ముడుపులు అందుతున్నట్లు సమాచారం. వారేం చేసినా అడగకుండా ఉండేందుకు పౌరసరఫరాల శాఖలో ఓ ఉన్నతాధికారికి సైతం ప్రతినెలా ఆమ్యామ్యాలు ముడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు.. పేదల బియ్యం అక్రమార్కుల పాలుకాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

బాలికపై అత్యాచారం

పోక్సో కేసు నమోదు

బుక్కపట్నం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన నారాయణస్వామి బుధవారం ఐదేళ్ల బాలికపై అత్యాచారానికి ఒడిగట్టాడు. సీఐ సురేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 50 ఏళ్ల వయసున్న నారాయణ స్వామి.. ఇంటి వద్ద ఆడుకుంటున్న బాలికకు మాయమాటలు చెప్పి తన ఇం టికి తీసుకెళ్లాడు. అత్యాచారానికి ఒడిగట్టాడు. కొద్దిసేపటి తరువాత ఏడుస్తూ బాలిక వచ్చింది. తల్లి అడగ్గా.. బాలిక మాటలతో ఆమె గ్రహించింది. దీనిపై బాలిక తల్లి.. పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు పోక్సో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ సురేష్ తెలిపారు. నారాయణస్వామి.. పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది.


పాతూరు అమ్మవారిశాలలో వజ్రకవచ చీరతో వాసవీమాతకు అలంకరణ

జయ జయహే.. మహిషాసుర మర్దిని

అనంతపురం టౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పదో రోజు బుధవారం అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. అధిక ఆలయాల్లో మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చారు. జిల్లాకేంద్రంలోని ఆలయాల్లో అర్చకులు వేకువజామునే అమ్మవార్ల మూలవిరాట్టులను, ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పలు ఆలయాల్లో చిన్నారులు, కళాకారులు సాంప్రదాయబద్ధమైన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అలరించారు. అదేవిధంగా శింగనమల, రాప్తాడు నియోజకవర్గాల్లోని అమ్మవారి ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు జరిగాయి.


కొత్తూరు అమ్మవారిశాలలో మహిషాసుర మర్దినిగా వాసవీమాత


ఆదర్శనగర్ గంగమ్మ ఆలయంలో కాళికామాత అలంకరణ


నవయుగ కాలనీలో విశేషాలంకరణలో పూజలందుకుంటున్న పెద్దమ్మ


అశ్వవాహనంపై స్వామివారు

అశ్వవాహనంపై శ్రీవారి దర్శనం

అనంతపురం టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం పదో రోజున అశ్వవాహనంపై గోవిందుడు దర్శనమిచ్చాడు. ఉదయమే అర్చకులు ఆలయంలోని భూదేవి, శ్రీదేవి సమేత మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, పుష్పాలంకరణలు, తోమాల సేవ, ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఉత్సవమూర్తిని అశ్వవాహనంపై కొలువుదీర్చి మేళతాలాలు, డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న టీటీడీ సభ్యుడు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అర్బన్ బ్యాంకు వద్ద అమ్మవారు బుధవారం మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని మడకశిర ఎమ్మెల్యే టీటీడీ బోర్డు సభ్యుడు ఎంఎస్ రాజు తదితరులు దర్శించుకున్నారు.

అమ్మవారికి ఎమ్మెల్యే సునీత ప్రత్యేక పూజలు


యల్లమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్, జ్ఞాన

రామగిరి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వెంకటాపురంలో యల్లమ్మదేవి ఆలయం లో అమ్మవారు బుధవారం మహిషారమర్థిని అలంకరణలో దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే పరిటాల సునీత తనయుడు పరిటాలశ్రీరామ్, కోడలు పరిటాల జ్ఞానతో కలిసి దర్శించి ప్రత్యేక పూజలు చేయించారు. శ్రీరామ్, జ్ఞాన పెళ్లిరోజు కావడంతో భక్తులకు అన్నదానం చేశారు.

వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం


కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

అనంతపురం రూరల్, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీనివాసనగర్‌లో గల బాలాజీ కల్యాణ మండపంలో బుధవారం రాయలసీమ బలిజ మహా సంఘం ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. వేద పండితులు.. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణాన్ని జరిపించారు. వేడుకకు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నగర డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య హాజరయ్యారు. సంఘం అధ్యక్షుడు శంకరయ్య, సభ్యులు కృష్ణమూర్తి, సాయిప్రసాద్, విజయభాస్కర్, రమేష్, వెంకటరాముడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా బీఎస్ఎన్ఎల్ సేవలు

● త్వరలోనే 5జీ అందుబాటులోకి..
● జూబ్లీ వేడుకలో సంస్థ పీజీఎం ముజీబ్‌పాషా


మాట్లాడుతున్న పీజీఎం ముజీబ్‌పాషా

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ టెలికం సంస్థలకు ధీటుగా బీఎస్ఎన్ఎల్ సేవలను వినియోగదారులకు అందిస్తున్నామని ఆ సంస్థ పీజీఎం ముజీబ్ పాషా అన్నారు. బీఎస్ఎన్ఎల్‌ను స్థాపించి 25 ఏళ్లు పూర్తి కావడంతో నగరంలోని ఆ సంస్థ కార్యాలయంలో బుధవారం జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పీజీఎం మాట్లాడుతూ.. పాతికేళ్ల సుదీర్ఘప్రస్థానంలో వినియోగదారులకు పలు రకాలు సేవలందించామన్నారు. ప్రైవేట్ టెలికాం సంస్థలతో పోటీపడుతూ 4జీ సేవలు అందిస్తున్నామన్నారు. ఇదే ఒరవడితో 5జీ సేవలను కూడా ప్రజలకందించేందుకు ప్ర యత్నాలు చేస్తున్నామన్నారు. 25 ఏళ్ల కాలంలో ఉమ్మడి అనంత జిల్లాలో 13,208 ఎఫ్‌టీటీహెచ్ కనెక్షన్లు, 189 ఓఎల్‌టీఎస్, 2,79,591 మందికి ప్రీపెయిడ్, 2,679 మందికి పోస్ట్ పెయిడ్, 790 ఐఎల్ఎల్ కనెక్షన్లను ఇచ్చినట్లు వివరించారు. అదే విధంగా 350 టవర్లను ఏర్పాటు చేసి మారుమూల గ్రామాలకు సైతం సిగ్నల్స్, హైస్పీడ్ ఇంటర్‌నెట్ సేవలను అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ కనెక్షన్లు తీసుకునే యూజర్స్‌కు ఉచితంగా సిమ్‌ను ఇస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని రకాల సేవలను వినియోగదారులకు అందించనున్నామని పేర్కొన్నారు. సమావేశంలో డీజీఎం బాలగంగాధర్, ఏజీఎం బాలాజీ, ఎస్‌డీఈలు రేవతి, హేమంత్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక డిమాండ్లను నెరవేర్చాలంటూ వైద్యుల నిరసన


నిరసన తెలుపుతున్న పీహెచ్‌సీ వైద్యులు

అనంతపురం వైద్యం, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను ప్ర భుత్వం వెంటనే నెరవేర్చాలంటూ పీహెచ్‌సీ వైద్యులు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ వైద్యులు నారాయణస్వామి, శ్రీనివాసబాబు, విష్ణుమూర్తి మాట్లాడుతూ.. ప్రమోషన్లు, పీజీ కోటా, పారితోషికం తదితర డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచామన్నారు. వెంటనే నెరవేర్చాలని కోరారు. పీహెచ్‌సీ వైద్యులు స్వాతి, ఆసియా, తరుణసాయి, ప్రీతి, తేజస్విని, ఉన్నతి, శ్రావణి, ఎమీమ, సుస్మిత, లక్ష్మీచందన, లోకేష్, శివసాయి, రాజేష్, మనోజ్, సరేందర్‌రెడ్డి, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ బుక్కుకు భయపడేది లేదు: ఎంపీ బీకే


పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీ బీకే పార్థసారథి

అనంతపురంరూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ డిజిటల్ బుక్కు కాకుంటే..మరో బుక్కు పెట్టుకున్నా.. దేనికీ బెదిరేదీలేదని హిందూపురం ఎంపీ బీకే పార్థసారధి అన్నారు. మండలంలోని రాచానపల్లిలో బుధవారం ఆయన జడ్పీటీసీ మాజీ సభ్యుడు వేణుగోపాల్, రాచానపల్లి సింగిల్ విండో అధ్యక్షుడు పామురాయి రఘు, ఎంపీటీసీ కృష్ణారెడ్డితో కలిసి పింఛన్ల పంపిణీ చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తోందన్నారు. సీఎం చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు మెరుగుపర్చుకుంటూ పథకాల అమలు చేస్తున్నారన్నారు. పోలవరం పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. అలాగే రాయలసీమను రతనాలసీమగా మార్చడానికి సీఎం కృషి చేస్తున్నారన్నారు. అభివృద్ధిని జీర్ణించుకోలేని జగన్ డిజిటల్ బుక్కు అంటూ భయపెట్టాలని చూస్తున్నారన్నారు. అయితే అలాంటి వాటికి బెదిరేదే లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దివాకర్, డిప్యూటీ ఎంపిడిఓ వెంకటనాయుడు, పంచాయితీ కార్యదర్శి మహమ్మద్ రఫీ, టీడీపీ మండల నాయకులు పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న నంబూరి రమణ

రాప్తాడు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా నంబూరి కన్‌స్ట్రక్షన్స్ ఛైర్మన్, హంపాపురం టీడీపీ నాయకుడు నంబూరి రమణ తన సంస్థ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతపురం నగరంలోని తన కార్యాలయంలో బుధవారం ఈ కార్యక్రమం చేపట్టారు.

'జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ప్రయోజనం'

చెన్నేకొత్తపల్లి/రాప్తాడు/ఆత్మకూరు/శింగనమల అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): అన్ని వ్యవసాయ యంత్ర, పరికరాల మీద కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిందని, ఇది రైతులకు ఎంతో ఉపయోగకరమని జిల్లా వ్యవసాయశాఖ అధికారి రామూనాయక్ పేర్కొన్నారు. మండలంలోని ప్యాదిండి గ్రామంలో బుధవారం వ్యవసాయాధికారులు, రైతులు సూపర్‌జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో రామూనాయక్ పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అన్ని వ్యవసాయ ట్రాక్టర్లపై, యంత్రాలపై జీఎస్టీ తగ్గించిందన్నారు. ఇది రైతులకు ఎంతో ఉపయోగకరమని, యంత్రాల కొనుగోలుపై ఎంతో సొమ్ము ఆదా అవుతుందని తెలిపారు. అలాగే రాప్తాడు, ఆత్మకూరు, శింగనమల మండలకేంద్రాల్లో వ్యవసాయాధికారులు, రైతులు, టీడీపీ శ్రేణులు సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై ర్యాలీ నిర్వహించారు.

అనధికార కొళాయి కనెక్షన్లపై చర్యలు తీసుకోండి


కమిషనర్‌కి వినతి పత్రం అందజేస్తున్న కృష్ణమూర్తి

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో అనధికార కొళాయి కనెక్షన్లపై చర్యలు తీసుకోవాల ని 3వ డివిజన్ కార్పొరేటర్ అంకె కుమారమ్మ భర్త కృష్ణమూర్తి కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామిని క లిసి వినతిపత్రం అందజేశారు. కమిషనర్ స్పందిస్తూ విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మహిళా రైతు ఆత్మహత్య


స్వాతి, (ఫైల్)

ఆత్మకూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని తోపుదుర్తి గ్రామానికి చెందిన మహిళారైతు స్వాతి (34) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకుంది. గ్రామంలోని ఇంట్లోనే మూడురోజుల క్రితం ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉంది. కొద్దిసేపటికి కుటుంబసభ్యులు గమనించి అనంతపురం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఆమెకు భర్త సురేష్ నాయుడు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పది ఎకరాల్లో ఏటా వేరుశనగ సాగుకు పెట్టు బడులు పెట్టి తీవ్రంగా నష్టపోయారు. ఈ క్రమంలో సుమారు రూ. పది లక్షలకు పైగా అప్పులు అయ్యాయి. ఇప్పుడు కూడా మొక్కజొన్న సాగుకు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టా రు. అయితే ఈ అప్పులు ఎలా తీర్చాలోనని ఆమె నిత్యం మదనపడుతుండేదని, ఈక్రమంలో మనస్థాపం చెంది ఈ అఘాయిత్యానికి ఒడిగట్టిందని కుటుంబసభ్యులు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నలుగురికి గాయాలు

కనగానపల్లి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్వతదేవరపల్లి వద్దగల 44వ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. బెంగళూరు నుంచి కర్నూలు జిల్లా ఆదోనికి ఏపీఎస్ ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో వెళ్తోంది. అయితే పర్వతదేవరపల్లి వద్ద ముందు వెళుతున్న ఐషర్ వాహనం ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న గౌస్, వంశీ, పరుశురామ్, పురుషోత్తం గాయపడ్డారు. వారిని అనంతపురం ఆసుపత్రికి తరలించారు. కనగానపల్లి పోలీసులు కేసునమోదు చేసుకున్నారు.

బాధ్యతల స్వీకరణ

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామ్‌నగర్‌లో గల రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా సీనియర్ అసిస్టెంట్ ఇస్మాయిల్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు సబ్‌రిజిస్ట్రార్‌గా ఉన్న యూనస్ తాడిపత్రికి బదిలీపై వెళ్లారు. దీంతో ఇక్కడికి రెగ్యులర్ సబ్‌రిజిస్ట్రార్‌గా వచ్చేందుకు ఎవరూ ఆసక్తి చూపలేదు. దీంతో అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఇస్మాయిల్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

పింఛన్ల పంపిణీ

గార్లదిన్నె, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంతో పాటు జంబులదిన్నె గ్రామంలో బుధవారం ఏడీసీసీ బ్యాంకు చెర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి లబ్ధిదారులకు సామాజిక పంపిణీ చేశారు. డీసీ చెర్మన్ చంద్రశేఖర్ నాయుడు, టీడీపీ నాయకులు గేట్టుక్రిష్టారెడ్డి, గుర్రం ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

బొందలవాడలో ఆలం..

నార్పల: మండలంలోని బొందవాడ గ్రా మంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు పింఛన్లు పంపిణీ చేశారు. అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును అందించారు. పార్టీ కన్వీనర్ ఎర్రినాగప్ప, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ తలారి కుళ్లాయప్ప, నాయకులు నాగభూషణ, సోమశేఖర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరిహారం ఇవ్వాలి

రాప్తాడు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): హంపాపురం సమీపంలో సెప్టెంబరు 20న విద్యుత్ ప్రమాదంలో గాయపడి మృతి చెందిన పశ్చిమ బెంగాల్ వాసి బైసి కుటుంబానికి పరిహారం ఇవ్వాలని సీఐటీయూ నాయకులు రామాంజనేయులు, పోతలయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు రాప్తాడు విద్యుత్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన తెలిపారు.

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్‌చిట్స్ / ఆర్బిట్రేటర్, అనంతపురము
డి.ఆర్.ఏ.44/2025

మెస్సర్స్ శ్రీరామ్ రాఘవేంద్ర చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్, అనంతపురం బ్రాంచ్
-- డిస్‌ప్యూటెంట్
వర్సెస్
జి.రూపేష్ కుమార్ చౌదరి మరియు ఇతరులు
- అపోనెంట్స్

అపోనెంట్ 3 మరియు 4 కినోటీసు

3.బాయ్‌కాటి పణీంద్ర తండ్రి: బి.లక్ష్మి నారాయణ, వయస్సు:34సం॥లు, ఉద్యోగి: జూనియర్ అసిస్టెంట్ గ్రేడ్-III ఎంప్లాయి ఐ.డి.: 1055263, ఆఫీసు/ఆఫ్ కమర్షియల్ టాక్స్ ఆఫీసు, తాడిపత్రి గ్రామం మరియు మం॥ నివాసం: డో.నెం: 28-3-794, పెర్రర్ నగర్, అనంతపురం.

4.యం.భరత్‌కుమార్, తండ్రి: యం.క్రిష్ణమూర్తి, వయస్సు:39సం॥లు, నివాసం:డో.నెం: 28-6-955, హమాలీ కాలనీ, రాజ స్కూలు దగ్గర, అనంతపురం సిటీ.

డిస్‌ప్యూటెంట్, డిస్‌ప్యూట్ బాకీమొత్తం రూ. 3,45,350/-లు రాబట్టుకొనుటకు గానూ మీపై దాఖలుచేసిన డిస్‌ప్యూట్‌లో 3మరియు 4కి అపోనెంట్ అయిన మీరు 15-10-2025 తేదీన హాజరు అగుటకు గానూ వాయిదా వున్నది. పైదినం ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ O/o ది జిల్లా రిజిస్ట్రార్, డోర్.నెం. 6-3-134, 1వ అంతస్తు, రామ్‌నగర్, అనంతపురము వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోనంతట డిస్‌ప్యూట్ మీ పరోక్షమున తీర్మానించబడును.

By order of Deputy Registrar of Chits
O/of the District Registrar, Registration and Stamps Dept., D.No. 6-3-134, 1st Floor, Ram Nagar, Ananthapuramu

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్‌చిట్స్ / ఆర్బిట్రేటర్, అనంతపురము
డి.ఆర్.ఏ.177/2024

మెస్సర్స్ శ్రీరామ్ రాఘవేంద్ర చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్, అనంతపురం బ్రాంచ్
-- డిస్‌ప్యూటెంట్
వర్సెస్
యల్.ప్రతాప్ మరియు ఇతరులు
- అపోనెంట్స్

అపోనెంట్ 2 కినోటీసు

2.మంగే దేవదానమ్ సాల్మన్ రాజు తండ్రి: యం.దేవదానమ్, వయస్సు: 55 సం॥లు, ఉద్యోగి: జూనియర్ అసిస్టెంట్ ఎంప్లాయి ఐ.డి.: 1003368, సియఫ్‌యమ్‌సి ఐడి 14441173, ఆఫీసు/ఆఫ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఇన్‌ఫర్‌మేషన్ మరియు పబ్లిక్ రిలేషన్ డిపార్టుమెంటు, అనంతపురం, నివాసం: డో.నెం: 18-2-275, రాజహంస ప్యాలెస్, వేణుగోపాల్ నగర్, అనంతపురం.

డిస్‌ప్యూటెంట్, డిస్‌ప్యూట్ బాకీమొత్తం రూ. 3,96,066/-లు రాబట్టుకొనుటకు గానూ మీపై దాఖలుచేసిన డిస్‌ప్యూట్‌లో 2కి అపోనెంట్ అయిన మీరు 15-10-2025 తేదీన హాజరు అగుటకు గానూ వాయిదా వున్నది. పైదినం ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ O/o ది జిల్లా రిజిస్ట్రార్, డోర్.నెం. 6-3-134, 1వ అంతస్తు, రామ్‌నగర్, అనంతపురము వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోనంతట డిస్‌ప్యూట్ మీ పరోక్షమున తీర్మానించబడును.

By order of Deputy Registrar of Chits
O/of the District Registrar, Registration and Stamps Dept., D.No. 6-3-134, 1st Floor, Ram Nagar, Ananthapuramu

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్‌చిట్స్ / ఆర్బిట్రేటర్, అనంతపురము
డి.ఆర్.ఏ.26/2025

మెస్సర్స్ శ్రీరామ్ రాఘవేంద్ర చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్, అనంతపురం బ్రాంచ్
-- డిస్‌ప్యూటెంట్
వర్సెస్
యం.రమేష్‌కుమార్ మరియు ఇతరులు
- అపోనెంట్స్

అపోనెంట్ 1,2 మరియు 3 కినోటీసు

1.యం.రమేష్‌కుమార్ తండ్రి: యం.మల్లికార్జున, వయస్సు: 28సం॥లు, ఉద్యోగి: ప్రైవేటు ఎంప్లాయి, నివాసం: డో.నెం: 12-1-224, అశోక్‌నగర్, అనంతపురం .

2. సి.లోకేశ్వర్ తండ్రి: సి.నాగరాజు, వయస్సు: 27 సం॥లు, ఉద్యోగి: రికార్డు అసిస్టెంట్ ఆఫీసు / ఆఫ్ డిప్యూటి డైరెక్టరు, (AH) Animal Husbandary, పెనుకొండ, శ్రీ సత్యసాయి జిల్లా, నివాసం: డో.నెం: 3-78-1, గాంధీనగర్, బుక్కరాయసముద్రం గ్రామం మరియు మండలం, అనంతపురం జిల్లా.

3.యం.లావణ్య, తండ్రి: హరిజన నారాయణ, వయస్సు: 27 సం॥లు, ఉద్యోగి: ఆఫీసు సబార్డినేట్, ఆఫీసు / ఆఫ్ డిప్యూటి డైరెక్టరు, (AH) Animal Husbandary, పెనుకొండ, శ్రీ సత్యసాయి జిల్లా, నివాసం: డో.నెం: 1-89, పెద్దకొండాపురం గ్రామం, రామగిరి మండలం, శ్రీ సత్యసాయి జిల్లా

డిస్‌ప్యూటెంట్, డిస్‌ప్యూట్ బాకీమొత్తం రూ. 37,566/-లు రాబట్టుకొనుటకు గానూ మీపై దాఖలుచేసిన డిస్‌ప్యూట్‌లో 1,2 మరియు 3 కి అపోనెంట్ అయిన మీరు 15-10-2025 తేదీన హాజరు అగుటకు గానూ వాయిదా వున్నది. పైదినం ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ O/o ది జిల్లా రిజిస్ట్రార్, డోర్.నెం. 6-3-134, 1వ అంతస్తు, రామ్‌నగర్, అనంతపురము వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోనంతట డిస్‌ప్యూట్ మీ పరోక్షమున తీర్మానించబడును.

By order of Deputy Registrar of Chits
O/of the District Registrar, Registration and Stamps Dept., D.No. 6-3-134, 1st Floor, Ram Nagar, Ananthapuramu

బహిరంగ ప్రకటన

అందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా! అనంతపురము జిల్లా మరియు టౌన్, కమలా నగర్, శ్రీ సాయి అడ్రస్ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్, ఫ్లాట్ నెం. సి3-బ్లాక్, 3వ ఫ్లోర్‌లో కాపురం ఉండు 1) లేట్ ఎ.ప్రభాకర్ గారి కుమారుడు అయిన ఎ.వి.ఆర్.అశ్వర్థనారాయణ & 2) ఎ.వి.ఆర్.అశ్వర్థనారాయణ గారి భార్య అయిన శ్రీమతి ఎ. సౌమ్యలక్ష్మి అనువారు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని యస్.బి.ఐ. సాయినగర్ బ్రాంచి, అనంతపురం నందు ఆయకం వుంచి గృహ ఋణం పొంది ప్రస్తుతం వారు సదరి షెడ్యూల్ దాఖలా ఆస్తి పై అదనపు లోను (అనగా టాప్-అప్ లోను) పొందుటకు నా క్లయింట్ అయిన యస్.బి.ఐ., గాంధీ బజార్ శాఖ, పాతవూరు, అనంతపురం వారిని అభ్యర్థించి వున్నారు. అయితే సదరి ఎ.వి.ఆర్. అశ్వర్థనారాయణ అనువారు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించిన రెండు ఒరిజినల్ లింకు పత్రములు (అనగా తేది:15.9.2011, డాక్యుమెంట్ నెం. 8902/2011 గా గల [illegible] గారి కుమారుడు అయిన [illegible] పేర వున్న ఒరిజినల్ రిజిస్టర్ విక్రయ పత్రము మరియు తేది: 15.9.2011, డాక్యుమెంట్ నెం. 8903/2011 గా గల శ్రీ సాయి బిల్డర్స్, బెంగళూరు తరుపున ఓనర్ అయిన లేట్ బి.టి.నాయక్ గారి కుమారుడు అయిన టి.యల్.నాయక్ మరియు [illegible] గారి కుమారుడు అయిన [illegible] ల మధ్య గల ఒరిజినల్ రిజిస్టర్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ ఖర్ కన్వర్షన్ పత్రము) తన వద్ద లేవని సదరి పత్రములను ఆను 19-9-2025 తేదీన యస్.బి.ఐ., గాంధీ బజార్ బ్రాంచి కు [illegible] సదరి విషయమై తాను మీ సేవా అప్లికేషన్ నెం. యమ్.యల్.టి. 12500570591 ద్వారా అనంతపురం 1వ పట్టణ పోలీస్ స్టేషన్ వారికి ఫిర్యాదు చేసి వారి నుండి 29.9.2025 తేదీన సర్టిఫికెట్ కూడా పొంది ఉన్నానని కావున ప్రస్తుతం తన వద్ద సదరి రెండు ఒరిజినల్ లింకు పత్రముల యొక్క నకలు పత్రములు మాత్రమే వున్నవని తెలిపి వున్నారు.

కావున ఎవరికైనా క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్తిని గురించి ఏలాంటి విక్రయాలు గాని, ఆయకములు గాని, లీజులు గాని లేదా తకరార్లు గాని ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 10 రోజుల లోపు నాకుగాని లేదా నా క్లయింట్ బ్యాంక్ అయిన యస్.బి.ఐ., గాంధీ బజార్ శాఖ, పాతవూరు, అనంతపురం వారికి గాని తెలియజేయవలెను. లేని యెడల నా క్లయింట్ బ్యాంకు వారు పై తెలిపిన రెండు లింకు పత్రము యొక్క నకలు పత్రములను తీసుకొని పై తెలిపిన 1) ఎ.వి.ఆర్.అశ్వర్థనారాయణ & 2) శ్రీమతి ఎ. సౌమ్యలక్ష్మి గార్లకు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై అదనపు లోనును మంజూరు చేయుదురని తెలుపడమైనది.

షెడ్యూల్

అనంతపురం ఆర్.డి. మరియు సబ్.ఆర్.డి.కి చెందిన అనంతపురం టౌన్, వార్డు నెం. 14, టి.యస్.నెం. 2063, ఎ.సి.0.15.40 ఫ్లాట్ నెం.6. కొలతలు: తూర్పు-పడమర : 44 అడుగులు, ఉత్తరం-దక్షిణం : 110 అడుగులు, (745.77 చదరపు గజములు)
చెక్కుబంది: తూర్పు: [illegible] ఇల్లు మరియు ఖాళీ నెం.2, పడమర: యు.వెంకటేష్ ఇల్లు, ఉత్తరం: [illegible] ఇల్లు, దక్షిణం: రోడ్డు.
పై స్థలములో కట్టబడిన శ్రీ సాయి అడ్రస్ ఎన్‌క్లేవ్ రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్ నందు గల 1060 చ.అ. మరియు 21.73 చ.గ. అవిభాజ్య భాగము నందు కట్టబడిన ఫ్లాట్ నెం.సి3-బ్లాక్ గా గల ఫ్లాట్.
చెక్కుబంది: తూర్పు: ఓపెన్ టు స్కై, ఉత్తరం: ఫ్లాట్ నెం.బి3, పడమర: కారిడర్, దక్షిణం: ఓపెన్ టు స్కై

టి. విశ్వనాథ్, అడ్వకేట్, అనంతపురం. సెల్: 9440285641

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్‌చిట్స్ / ఆర్బిట్రేటర్, అనంతపురము
డి.ఆర్.ఏ.192/2024

మెస్సర్స్ శ్రీరామ్ రాఘవేంద్ర చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్, అనంతపురం బ్రాంచ్
-- డిస్‌ప్యూటెంట్
వర్సెస్
కె.టి.జోస్వదినకర్ మరియు ఇతరులు
- అపోనెంట్స్

అపోనెంట్ 1,2,3,4 మరియు 5 కినోటీసు

1.కె.టి.జోస్వదినకర్ తండ్రి: జెడ్.సునీల్ కుమార్, వయస్సు:38సం॥లు, వ్యాపారం: నివాసం: డో.నెం: 12-4-966, ఆదర్శ నగర్, అనంతపురం.

2.జెడ్.సునీల్‌కుమార్, తండ్రి: కె.టి.జక్రయ్య, వయస్సు: 50సం॥లు, ఉద్యోగి:ఇంజన్ డ్రైవర్, ఎంప్లాయి,పోలీస్ ట్రైనింగ్ కాలేజ్, అనంతపురం, నివాసం:డో.నెం:12-4-966, ఆదర్శ నగర్, అనంతపురం.

3.బి.రాజు, తండ్రి: బి.రంగప్ప, వయస్సు: 38సం॥లు, వ్యాపారం: నివాసం: డో.నెం: 1-3-68, రంగస్వామి నగర్, అనంతపురం.

4.యం.ఆనంద్ బాబు, తండ్రి: యం.పుల్లయ్య, వయస్సు: 38సం॥లు, ఉద్యోగి: పోలీస్ కానిస్టేబుల్ CFMS No.142, II టౌన్‌పోలీస్ స్టేషన్, న్యూటౌన్, అనంతపురం,నివాసం: డో.నెం: 7-80-32, సి.బ్లాక్,పోలీస్ క్వార్టర్స్ 2టౌన్ పోలీస్ స్టేషన్ వెనుక, అనంతపురం.

5.వి.బాలరాజు తండ్రి:వి.నారాయణ వయస్సు: 56సం॥లు, ఉద్యోగి: స్కూలు అసిస్టెంట్, (హిందీ) ఎంప్లాయి కోడ్.నెం.1036776, జెడ్.పి.హెచ్.యస్ స్కూలు, తూముకుంట గ్రామం, హిందూపురం మం॥, శ్రీ సత్యసాయి జిల్లా నివాసం: డోర్.నెం. 10-1-117, అంబేద్కర్ నగర్, హిందూపురం, శ్రీ సత్యసాయి జిల్లా

డిస్‌ప్యూటెంట్, డిస్‌ప్యూట్ బాకీమొత్తం రూ. 2,32,431/-లు రాబట్టుకొనుటకు గానూ మీపై దాఖలుచేసిన డిస్‌ప్యూట్‌లో 1,2,3,4 మరియు 5కి అపోనెంట్ అయిన మీరు 08-10-2025 తేదీన హాజరు అగుటకు గానూ వాయిదా వున్నది. పైదినం ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ O/o ది జిల్లా రిజిస్ట్రార్, డోర్.నెం. 6-3-134, 1వ అంతస్తు, రామ్‌నగర్, అనంతపురము వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోనంతట డిస్‌ప్యూట్ మీ పరోక్షమున తీర్మానించబడును.

By order of Deputy Registrar of Chits
O/of the District Registrar, Registration and Stamps Dept., D.No. 6-3-134, 1st Floor, Ram Nagar, Ananthapuramu



సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

పేదలకు సరుకుల పంపిణీ

కళ్యాణదుర్గం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రజావేదిక వద్ద పేదలకు నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు బుధవారం పంపిణీ చేశారు. స్థానిక పాత బస్టాండులో చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల్లో భాగంగా అక్కడ ఏర్పాటు చేసుకున్న 30 చిన్న దుకాణాలు తొలగించారు. వ్యాపారం లేక వారు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే. వారికి విజయదశమి సందర్భంగా నెలకు సరిపడా నిత్యావసర సరుకులను కూటమి నాయకులతో కలసి అందజేశారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా ఆదుకోవడానికి తాను ఎల్లప్పుడూ ముందుంటానన్నారు.

● కలెక్టర్, ఎస్పీతో భేటీ: నూతన కలెక్టర్ ఆనంద్‌ను కలెక్టరేట్‌లో, ఎస్పీ జగదీష్‌ను ఆయన చాంబర్‌లో ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని సమస్యలను ఎమ్మెల్యే వారి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

● పింఛన్ల పంపిణీ

శెట్టూరు: మండలంలోని చెర్లోపల్లిలో ఎమ్మెల్యే అమిలినేని టీడీపీ నాయకులు, గ్రామస్థులతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు రూ. 50 వేలు, చర్చి నిర్మాణానికి రూ.25 వేలు సొంత నిధులు అందించారు. ఈద్గా కాంపౌండ్ వాల్ నిర్మాణానికి తప్పకుండా నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

సమ్మె కారణంగానే వైద్యులు గైర్హాజరు

విడపనకల్లు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని మంగళవారం నుంచి మూడు రోజులు సమ్మెలో ఉన్నామని, ఈ కారణంగానే తాము విధులకు హాజరు కాలేదని మండలంలోని పాల్తూరు గ్రామంలోని పీహెచ్‌సీ వైద్యులు శివశంకర్, సుస్మిత బుధవారం తెలిపారు. సమ్మె విరమించిన అనంతరం విధులకు హాజరవుతామని తెలిపారు.

పింఛన్ల పంపిణీ

గుంతకల్లు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిలక్ నగర్‌లో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, కేసీ హరి, బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, తలారి మస్తానప్ప పాల్గొన్నారు.

కార్మికుల కృషి వల్లే తాడిపత్రికి మొదటి ర్యాంక్

తాడిపత్రి, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులు, సిబ్బంది శ్రమ చేయడం వల్లే తాడిపత్రికి రాష్ట్రంలోనే మొదటిస్థానం దక్కిందని మున్సిపల్ కార్మికులను జేసీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం కార్మికులకు విందు భోజనం ఏర్పాటుచేశారు. ఆయనే స్వయంగా కార్మికులకు భోజనం వడ్డించారు.



కార్మికులతో మాట్లాడుతున్న జేసీపీఆర్

కార్మికులకు దుస్తుల పంపిణీ

పామిడి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి):పామిడి మేజర్ గ్రామ పంచాయతీలోని 49 మంది పారిశుధ్య కార్మికులకు దసరా పండుగను పురస్కరించుకొని డీఎల్‌పీఓ విజయలక్ష్మి, ఎంపీడీఓ తేజోత్స్న, డిప్యూటీ ఎంపీడీఓ అశ్వత్థమ నాయుడు దుస్తులు, నిత్యావసర వస్తువులను బుధవారం పంపిణీ చేశారు. అనంతరం భావసార క్షత్రియ కల్యాణ మండపంలో నిర్వహించిన అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవంలో ఆర్డీఓ శ్రీనివాసులు, డీఎల్‌పీఓ, ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓ పాల్గొన్నారు. తదనంతరం పట్టణవీధుల్లో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యాలయం, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



కార్మికులకు దుస్తులు అందజేస్తున్న అధికారులు

జయజయహే మహిషాసుర మర్దిని



కళ్యాణదుర్గం: మహిషాసురమర్దిని అలంకరణలో వాసవీమాత

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పదవరోజున బుధవారం అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. పలు ఆలయాల్లో అమ్మవారి మూలవిరాట్‌కు మహిషాసుర మర్దిని అలంకారం చేశారు. గుత్తి మండలంలోని సేవాఘడ్‌లో మాతాజగదాంబ, ఉరవకొండలో దుర్గాభవాని మాత, రాయదుర్గంలో శ్రీచౌడేశ్వరి అమ్మవారు, కళ్యాణదుర్గంలో వాసవీమాత మహిషాసుర మర్దినిగా అలంకరించారు. యాడికిలో చండీకాదేవిగా పెద్దమ్మతల్లి, గుంతకల్లులో రాజసులోచనాదేవిగా వాసవీ అమ్మవారు, తాడిపత్రిలో కన్యాకుమారిదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి దర్శనమిచ్చారు.



గుంతకల్లు: రాజ సులోచనాదేవి అలంకారంలో వాసవీ అమ్మవారు



రాయదుర్గం: మహిషాసురమర్దిని అలంకరణలో చౌడేశ్వరి



ఉరవకొండ: మహిషాసుర మర్దినిగా దుర్గాభవాని



యాడికి : చండికాదేవిగా పెద్దమ్మతల్లి



బొమ్మనహాళ్: గోవిందవాడలో కన్యకాపరమేశ్వరి



తాడిపత్రి: కన్యాకుమారిదేవిగా కన్యకాపరమేశ్వరి



గుత్తిరూరల్: సేవాఘడ్‌లో మాతాజగదాంబ

న్యూస్ బాక్స్

వ్యక్తిపై దాడి

గుత్తి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక చెంబులబావి వీధికి చెందిన వెంకటరామరెడ్డిపై కోట ప్రాంతానికి చెందిన అఫ్జల్, మరి కొంత మంది మంగళవారం రాత్రి దాడి చేయడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. ఆర్థిక లావాదేవీల్లో విభేదాల వల్లే ఈ దాడికి పాల్పడ్డారని, కేసు దర్యాప్తులో ఉందని పోలీసులు తెలిపారు.

సచివాలయ సిబ్బందికి మెమో

బెళుగుప్ప, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లి సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. గత నెల 29 సచివాలయ కార్యాలయానికి మూడున్నర గంటలకే తాళం వేసి సిబ్బందికి వెళ్లిపోయారు. దీనిపై ఆంధ్రజ్యోతి ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన ఎంపీడీఓ లక్ష్మీనారాయణ ఆ సచివాలయంలోని పది మందికి మెమో జారీ చేశారు. ఎందుకు అందుబాటులో లేరో వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

హంద్రీనీవా కాలువలో కూలీ గల్లంతు

వజ్రకరూరు(ఉరవకొండ), అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొనకొండ్లకు చెందిన వ్యవసాయ కూలీ రామాంజినేయులు ఛాయాపురం సమీపంలోని హంద్రీనీవా కాలువలో బుధవారం ప్రమాదవశాత్తు జారిపడి గల్లంతయ్యాడు. కాలువ వద్ద ఉన్న వ్యవసాయ మోటారుకు మరమ్మతులతో పాటు ఆయుధ పూజ చేసేందుకు వెళ్లిన ఆయన కాలువలోకి జారిపడ్డాడు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, గ్రామస్థులు గాలింపు చర్యలు చేపట్టారు.

జీఎస్టీ తగ్గింపుతో రూ.వేల కోట్ల ఆదా

రాయదుర్గం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు సొమ్ము ఆదా అవుతోందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు స్పష్టంచేశారు. పట్టణంలోని శ్రీనివాసరేడియో హౌస్, హోండో షోరూమ్‌లను బుధవారం ఆయన పరిశీలించారు. జీఎస్టీ స్లాబ్ కుదింపు అనంతరం వస్తువుల ధరలు ఏ మేరకు తగ్గాయో సంబంధిత నిర్వహణను అడిగి తెలుసుకున్నారు.

ట్రంప్ టారిఫ్‌లు దేశానికి నష్టం

సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప

గుంతకల్లుటౌన్, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): ట్రంప్ విధిస్తున్న టారీఫ్‌లతో దేశానికి చాలా నష్టమని జరుగుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప అన్నారు. స్థానిక సీఐటీయూ కాలనీలో సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ట్రంప్ టారీఫ్ టెర్రరిజం భారతదేశంపై ప్రభావం సదస్సులో ఆయన మాట్లాడారు. టారీఫ్‌లపై ట్రంప్‌ను ప్రధాన మంత్రి మోదీ ప్రశ్నించలేని స్థితిలో ఉన్నారని, ఈ ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థపై పడుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతిప్రసాద్, కార్యదర్శి వర్గ సభ్యులు జగ్గలి రమేష్, రామునాయక్, సూరి, తిమ్మప్ప, షాకీరా, జయమ్మ, ప్రభావతి పాల్గొన్నారు.

దీర్ఘకాలిక డిమాండ్లను నెరవేర్చాలంటూ

వైద్యుల నిరసన



నిరసన తెలుపుతున్న పీహెచ్‌సీ వైద్యులు

అనంతపురం వైద్యం, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా పెం డింగ్‌లో ఉన్న డిమాండ్లను ప్ర భు త్వం వెంటనే నెరవేర్చాలంటూ పీహెచ్‌సీ వైద్యులు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాల యం ఎదుట బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ వైద్యు లు నారాయణస్వామి, శ్రీనివాసబాబు, విష్ణుమూర్తి మాట్లాడుతూ.. ప్రమోషన్లు, పీజీ కో టా, పారితోషికం తదితర డిమాండ్లను ప్రభు త్వం ముందు ఉంచామన్నారు. వెంటనే నెరవేర్చాలని కోరారు. పీహెచ్‌సీ వైద్యులు స్వాతి, ఆసియా, తరుణసాయి, ప్రీతి, తేజస్విని, ఉన్నతి, శ్రావణి, ఎమీమ, సుస్మిత, లక్ష్మీ చందన, లోకేష్, శివసాయి, రాజేష్, మనోజ్, సరేందర్‌రెడ్డి, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

'జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ప్రయోజనం'

చెన్నేకొత్తపల్లి/రాప్తాడు/ఆత్మకూరు/శింగనమలఅక్టోబరు1(ఆంధ్రజ్యోతి): అన్ని వ్యవసాయ యంత్ర, పరికరాల మీద కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిందని, ఇది రైతులకు ఎంతో ఉపయోగకరమని జిల్లా వ్యవసాయశాఖ అధికారి రామూనాయక్ పేర్కొన్నారు. మండలంలోని ప్యాదిండి గ్రామంలో బుధవారం వ్యవసాయాధికారులు, రైతులు సూపర్‌జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో రామూనాయక్ పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అన్ని వ్యవసాయ ట్రాక్టర్లపై, యంత్రాలపై జీఎస్టీ తగ్గించిందన్నారు. ఇది రైతులకు ఎంతో ఉపయోగకరమని, యంత్రాల కొనుగోలుపై ఎంతో సొమ్ము ఆదా అవుతుందని తెలిపారు. అలాగే రాప్తాడు, ఆత్మకూరు, శింగనమల మండలకేంద్రాల్లో వ్యవసాయాధికారులు, రైతులు, టీడీపీ శ్రేణులు సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై ర్యాలీ నిర్వహించారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి..

రొళ్ల, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రత్నగిరి గ్రామానికి చెందిన ఏడవ వార్డు మెంబర్ రామక్రిష్ణ, మడకశిర తెలుగుదేశం పార్టీ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సమక్షంలో వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, సింగల్‌విండో అధ్యక్షులు దాసిరెడ్డి, మండల కన్వీనర్ ఈరన్న, ఒక్కళిగ కన్వీనర్ పాండురంగప్ప పాల్గొన్నారు.

సచివాలయంలో పనిచేయని కంప్యూటర్లు

గుత్తి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని సీపీఐ కాలనీ 3వ సచివాలయంలో రెండు కంప్యూటర్లు, ఒక ప్రింటర్ పనిచేయడం లేదు. దీంతో సిబ్బంది, సచివాలయానికి వస్తున్న లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాసేవలు సంభించిపోయాయి. కంప్యూటర్లు, ప్రింటర్లు మరమ్మతులు చేయాలని స్థానిక మున్సిపల్ కమిషనర్ సచివాలయ సిబ్బంది లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేశారు. అయినా ఫలితం కనిపించలేదు. కార్యాలయానికి వస్తున్న ప్రజలు వారికి కావాల్సిన సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలన్నా.. ఒక పక్క సిస్టమ్ పనిచేయకపోవడం, నెట్ సౌకర్యం లేకపోవడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి సచివాలయంలోని కంప్యూటర్లు, ప్రింటర్లు మరమ్మతులు చేయించాలని సచివాలయ సిబ్బంది, స్థానికులు కోరుతున్నారు.



సీపీఐ కాలనీ సచివాలయంలో పాడైపోయిన కంప్యూటర్, ప్రింటర్

రోడ్డుపై మురుగునీరు

కూడేరు, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పై మురుగు నీరు ప్రవహిస్తోంది. దీంతో తీవ్ర దుర్వాసన వస్తోంది. రోడ్డు వెడల్పు చేసే సమయంలో ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజీలు నిర్మించారు. ఓ వైపునున్న డ్రైనేజీ నుంచి మురుగు నీరు బయటకు వెళ్లడానికి సక్రమంగా పనులు చేయకపోవడంతో అందులో నుంచి మురుగు బయటకు వస్తోంది. ఆ మురుగు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో తీవ్ర దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఎంపీడీఓ కార్యాలయం ఎదుటే మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తున్నా.. ఏ అధికారీ పట్టించుకోవడం లేదని, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



కాలువ నుంచి బయటకు వస్తున్న మురుగు నీరు



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు



బొమ్మనహాళ్‌లో నిర్మాణంలో ఉన్న బాలికల హాస్టల్ భవనం

శరవేగంగా హాస్టల్ భవన నిర్మాణం

బొమ్మనహాళ్, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బాలికల హాస్టల్ భవన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు చొరవతో రూ.1.50 కోట్లతో దీన్ని నిర్మిస్తున్నారు. ఈ భవన నిర్మాణం వచ్చే విద్యాసంవత్సరానికి పూర్తయ్యే దిశగా కాంట్రాక్టర్లు వేగంగా పనులు చేపడుతున్నారు. విశాలమైన గదులు, భోజనశాల, వసతి గదులు తదితర సౌకర్యాలతో ఈ హాస్టల్‌ను నిర్మిస్తున్నట్లు అధికారులు, టీడీపీ నాయకులు పయ్యావుల అనిల్, నాగరాజు, లాలుస్వామి తెలిపారు.

పింఛన్ల పంపిణీ

గార్లదిన్నె, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంతో పాటు జంబులదిన్నె గ్రామంలో బుధవారం ఏడీసీసీ బ్యాంకు చెర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి లబ్ధిదారులకు సామాజిక పంపిణీ చేశారు. డీసీ చెర్మన్ చంద్రశేఖర్ నాయుడు, టీడీపీ నాయకులు గేటుక్రిష్టారెడ్డి, గుర్రం ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా బీఎస్‌ఎన్ఎల్ సేవలు

- ●త్వరలోనే 5జీ అందుబాటులోకి
- ● జూబ్లీ వేడుకలో సంస్థ పీజీఎం ముజీబ్‌పాషా

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ టెలికం సంస్థలకు దీటుగా బీఎస్ఎన్ఎల్ సేవలను వినియోగదారులకు అందిస్తున్నామని ఆ సంస్థ పీజీఎం ముజీబ్ పాషా అన్నారు. బీఎస్ఎన్ఎల్‌ను స్థాపించి 25 ఏళ్లు పూర్తి కావడంతో నగరంలోని ఆ సంస్థ కార్యాలయంలో బుధవారం జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పీజీఎం మాట్లాడుతూ.. పాతికేళ్ల సుదీర్ఘప్రస్థానంలో వినియోగదారులకు పలు రకాలు సేవలందించామన్నారు. ప్రైవేట్ టెలికాం సంస్థలతో పోటీపడుతూ 4జీ సేవలు అందిస్తున్నామన్నారు. ఇదే ఒరవడితో 5జీ సేవలను కూడా ప్రజలకందించేందుకు ప్ర యత్నాలు చేస్తున్నామన్నారు. 25 ఏళ్ల కాలంలో ఉమ్మడి అనంత జిల్లాలో 13,208 ఎఫ్‌టీటీహెచ్ కనెక్షన్లు, 189 ఓఎల్‌టీ ఎస్, 2,79,591 మందికి ప్రీపెయిడ్, 2,679 మందికి పోస్ట్ పెయిడ్, 790 ఐఎల్ఎల్ కనెక్షన్లను ఇచ్చినట్లు వివరించారు. అదే విధంగా 350 టవర్లను ఏర్పాటు చేసి మారుమూల గ్రామాలకు సైతం సిగ్నల్స్, హైస్పీడ్ ఇంటర్‌నెట్ సేవలను అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ కనెక్షన్లు తీసుకునే యూజర్స్‌కు ఉచితంగా సిమ్‌ను ఇస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని రకాల సేవలను వినియోగదారులకు అందించనున్నామని పేర్కొన్నారు. సమావేశంలో డీజీఎం బాలగంగాధర్, ఏజీఎం బాలాజీ, ఎస్‌డీఈలు రేవతి, హేమంత్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీజీఎం ముజీబ్‌పాషా

మహిళా రైతు ఆత్మహత్య

ఆత్మకూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని తోపుదుర్తి గ్రామానికి చెందిన మహిళారైతు స్వాతి (34) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకుంది. గ్రామంలోని ఇంట్లోనే మూడురోజుల క్రితం ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉంది. కొద్దిసేపటికి కుటుంబసభ్యులు గమనించి అనంతపురం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఆమెకు భర్త సురేష్ నాయుడు , ఇద్దరు పిల్లలు ఉన్నారు. పది ఎకరాల్లో ఏటా వేరుశనగ సాగుకు పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోయారు. ఈ క్రమంలో సుమారు రూ. పది లక్షలకు పైగా అప్పులు అయ్యాయి. ఇప్పుడు కూడా మొక్కజొన్న సాగుకు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టారు. అయితే ఈ అప్పులు ఎలా తీర్చాలోనని ఆమె నిత్యం మదనపడుతుండేదని, ఈక్రమంలో మనస్థాపం చెంది ఈ అఘాయిత్యానికి ఒడిగట్టిందని కుటుంబసభ్యులు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



స్వాతి, (ఫైల్)

నలుగురికి గాయాలు

కనగానపల్లి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్వతదేవరపల్లి వద్దగల 44వ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. బెంగళూరు నుంచి కర్నూలు జిల్లా ఆదోనికి ఏపీఎస్ ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో వెళ్తోంది. అయితే పర్వతదేవరపల్లి వద్ద ముందు వెళుతున్న ఐషర్ వాహనం ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న గౌస్, వంశీ, పరుశురామ్, పురుషోత్తం గాయపడ్డారు. వారిని అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

బాధ్యతల స్వీకరణ

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామ్‌నగర్‌లో గల రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా సీనియర్ అసిస్టెంట్ ఇస్మాయిల్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు సబ్‌రిజిస్ట్రార్‌గా ఉన్న యూనస్ తాడిపత్రికి బదిలీపై వెళ్లారు. ఇక్కడికి రెగ్యులర్ సబ్‌రిజిస్ట్రార్‌గా వచ్చేందుకు ఎవరూ ఆసక్తి చూపలేదు అనంతపురం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఇస్మాయిల్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

అనంతపురం రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీనివాసనగర్‌లో గల బాలాజీ కల్యాణ మండపంలో బుధవా రం రాయలసీమ బలిజ మహాసంఘం ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. వేద పండితులు.. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణాన్ని జరిపించారు. వేడుకకు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నగర డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య హాజరయ్యారు. సంఘం అధ్యక్షుడు శంకరయ్య, సభ్యులు కృష్ణమూర్తి, సాయిప్రసాద్, విజయభాస్కర్, రమేష్, పాల్గొన్నారు.

ఆయుధపూజ చేసిన మంత్రి సవిత

పెనుకొండ టౌన్, (ఆంధ్రజ్యోతి): విజయదశమి సందర్భంగా తననివాసంలో ఆయుధపూజ కార్యక్రమాన్ని మంత్రి సవిత నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

చండీహోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

మడకశిర రూరల్, (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని చందకచర్ల గ్రామంలో గంగమ్మదేవత ఆలయంలో జరుగుతున్న చండీహోమంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

వృద్ధులకు సరుకుల పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న నాయకులు

ఉరవకొండ, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివరామిరెడ్డి కాలనీలో ఆర్డీటీ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో వృద్ధుల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేశారు. అనంతరం వృద్ధులకు నిత్యావసర సరుకులు, మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. వృద్ధాశ్రమానికి పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్ రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్యారం కేశవానంద, ఫాస్టర్లు జగదీష్, సురేష్ పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు ఎంపిక



గుంతకల్లుటౌన్, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్ మొదటి సంవత్సరం చదువుతున్న హరికృష్ణ సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ లక్ష్మయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్శిటీ స్థాయి కబడ్డీ పోటీలో హరికృష్ణ ప్రతిభ చూపాడని, ఈనెల 3 నుంచి 7 వరకు కర్ణాటక రాష్ట్రం బెలగవిలోని రాణి చెన్నమ్మ యూనివర్శిటీలో జరిగే సౌత్‌జోన్ కబడ్డీ పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు.

కంపచెట్లు తొలగించండి

శెట్టూరు, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసంపల్లి గ్రామం నుంచి శెట్టూరుకు వెళ్లే ప్రధాన రహదారి ఇరుపక్కలా కంపచెట్లు ఎత్తుగా పెరిగాయి. దీంతో ఆ రహదారిలో వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని బసంపల్లి గ్రామ ప్రజలు వాపోతున్నారు. ఎదురెదురుగా వాహనాలు వస్తే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులు తెలిపినా పట్టించుకోలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ముళ్లకంప చెట్లను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఏపుగా పెరిగిన కంపచెట్లు

అమ్మవారికి ఎమ్మెల్యే సునీత ప్రత్యేక పూజలు



యల్లమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్, జ్ఞాన

రామగిరి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వెంకటాపురంలో యల్లమ్మదేవి ఆలయం లో అమ్మవారు బుధవారం మహిషారమర్ధిని అలంకరణలో దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే పరిటాల సునీత తనయుడు పరిటాలశ్రీరామ్, కోడలు పరిటాల జ్ఞానతో కలిసి దర్శించి ప్రత్యేక పూజలు చేయించారు. శ్రీరామ్, జ్ఞాన పెళ్లిరోజు కావడంతో భక్తులకు అన్నదానం చేశారు.

వెంకటేశ్వరస్వామి అలంకరణలో ఖాద్రీశుడు



కదిరి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బుధవారం వెంకటేశ్వర స్వామి అలంకరణల భక్తులకు దర్శనమిచ్చారు. నిత్య కైంకర్యాలు, అలంకరణ అనంతరం వెంకటేశ్వరస్వామి అలంకరణలో ఉన్న స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారు వెంకటేశ్వరస్వామి అలం కరణలో భక్తులకు కనువిందు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.




గుంతకల్లు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు, యాడికి: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, రైతులు, ఫర్టిలైజర్స్ డీలర్లు

జీఎస్టీ తగ్గింపుతో ఆదాపై అవగాహన ర్యాలీ

గుంతకల్లు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో ప్రజలు పొందే లబ్ధిపై ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పట్టణంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జీఎస్టీ రేట్లు 18 శాతం ఉండేవి 12కు, 12 శాతం ఉన్నవి 5కు, ఐదు శాతం ఉన్నవి 0కు తగ్గిపోయాయన్నారు. దీంతో నిత్యావసర వస్తువుల ధరలు బాగా తగ్గుతాయన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ మాట్లాడుతూ.. దసరా కానుకగా కూటమి ప్రభుత్వం తెచ్చిన జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రజలు, వ్యాపారులు చాలా సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, కేసీ హరి, బీఎస్ కృష్ణా రెడ్డి, తలారి మస్తానప్ప, బండారు ఆనంద్, గుణశేఖర్, ఫజులు, మెహరున్నిసా, పత్తి హిమబిందు, అంజి, హనుమంతు పాల్గొన్నారు.

యాడికి : జీఎస్టీ 2.0తో వ్యవసాయశాఖలో ఇస్తున్న సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌తో రైతులకు చాలా ప్రయోజనం చేకూరుతుందని మండల వ్యవసాయశాఖ అధికారి మహబూబ్ బాషా తెలిపారు. జీఎస్టీ 2.0పై బుధవారం యాడికిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ జీఎస్టీ 2.0తో వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల ధరలు తగ్గుతాయని తెలిపారు. ఎరువుల తయారీ, ముడిపదార్థాలపై జీఎస్టీ 18 శాతం నుంచి 5 శాతంకు తగ్గించారని తెలిపారు. సూక్ష్మపోషకాలు, బయో పురుగు మందులపై 12నుంచి 5శాతంకు తగ్గించారని తెలిపారు. వ్యవసాయ యంత్రాలు ట్రాక్టర్లు, హార్వెస్టింగ్ యంత్రాలు, ట్రాక్టర్ల భాగాలు, స్ప్రేయర్లు, స్ప్రింకర్లపై జీఎస్టీ భారీగా తగ్గిందని తెలిపారు. అవగాహన ర్యాలీలో డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాసులు, ఏఓ నాగేశ్వర్‌రెడ్డి, ఆర్ఐ కిష్టప్ప, వ్యవసాయశాఖ సిబ్బంది రమేష్, రాంబాబు, నాగలక్ష్మి, యతీష, ఫర్టిలైజర్స్ దుకాణ డీలర్లు పాల్గొన్నారు.

● ఉరవకొండ : పట్టణంలో జీఎస్టీ సూపర్ సేవింగ్ కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు, అధికారులు ట్రాక్టర్లతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో ఏడీఏ సత్యనారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్ రేగాటి నాగరాజు, టీడీపీ నాయకులు ప్యారం కేశవానంద, తిమ్మప్ప, గోవిందు, మాజీ సర్పంచులు గోవిందు, వెంకటేష్ పాల్గొన్నారు.

● వజ్రకరూరు : వజ్రకరూరులో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఎంపీడీఓ శివాజీ రెడ్డి, ఈఓఆర్డీ దామోదర్‌రెడ్డి, ఏవో మధుకర్, ఏపీఓ విమల కార్యదర్శి మల్లయ్య పాల్గొన్నారు.

● యల్లనూరు : మండలకేంద్రంలో ఇన్‌ఛార్జ్ ఏఓ మధుకుమార్, తహసీల్దార్ రాము, ఎంపీడీఓ కరుణసాగర్, మండల టీడీపీ నాయకులు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

● గుత్తి: పట్టణంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అంశంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మీయా, చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, మార్కెట్ యార్డు చైర్మన్ సూర్యప్రతాప్, ఏడీఓ వెంకటరాముడు, డీఈ హేమచంద్ర, టీడీపీ నాయకులు చికెన్ శీనా, రామకృష్ణ, సుంకన్న పాల్గొన్నారు.

● కళ్యాణదుర్గంరూరల్ : పట్టణంలో రైతులతో కలిసి అధికారులు ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ఇందులో వ్యవసాయ శాఖ అధికారి ఏడీ యల్లప్ప, జీఎస్టీ అధికారి వెంకటేష్, మండల వ్యవసాయాధికారి శ్రావణ్‌కుమార్, ఆర్‌ఎస్‌కే సిబ్బంది, ఏపీఎంఐపీ సిబ్బంది, హార్టికల్చర్ సిబ్బంది పాల్గొన్నారు.

● రాయదుర్గంరూరల్ : మండలంలోని 74 ఉడేగోళం గ్రామ పంచాయతీలో ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. ఇందులో డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, ఎంపీడీఓ కొండన్న, అగ్రికల్చర్ ఆఫీసర్ మహమ్మద్ బాష, ఏపీఓ రవి, పంచాయతీ కార్యదర్శి వెంకటరాముడు, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

● బొమ్మనహాళ్ : మండల కేంద్రంలోని తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ విజయభాస్కర్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సినియర్ అసిస్టెంట్ హనుమంతప్ప, పంచాయతీ కార్యదర్శి కృష్ణరావు పాల్గొన్నారు.

● విడపనకల్లు: మండల కేంద్రంలో వ్యవసాయ కార్యాలయం నుంచి స్థానిక బస్టాండ్ వరకూ ట్రాక్టర్లుతో ర్యాలీ నిర్వహించారు. ఇందులో ఏఓ హెచ్ పెన్నయ్య, కమర్షియల్ ట్యాక్స్ అధికారి రామక్రిష్ణ, వీఆర్వో రంగయ్య, రైతులు చిక్కన్నయ్య, చెన్నరాయుడు, మల్లేసప్ప పాల్గొన్నారు.

● తాడిపత్రి : పట్టణంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో జీఎస్టీ సూపర్‌సేవింగ్స్‌పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఇందులో మండల వ్యవసాయాధికారి ఆంజనేయులు, ఉద్యానవనశాఖ అధికారి ఉమాదేవి, ఆత్మ సిబ్బంది పాల్గొన్నారు.

పండుగకు వస్తూ రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మూసాపేట, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తూ దసరా పండుగ కోసం సొంత గ్రామానికి వెళుతూ మార్గంమధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన 44వ నెంబర్ జాతీయ రహదారి మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం శాఖాపూర్ వద్ద బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం ఏపీలోని అనంతపురం జిల్లా యాడికి మండలం కమలపాడుకు చెందిన పవన్‌సాయి నవీన్‌కుమార్ (34) కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. దసరా పండుగ కోసం సొంత గ్రామం కమలపాడ్‌కు వెళ్లడానికి బుధవారం తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి రాయల్ ఎన్ఫీల్డ్ బుల్లెట్‌పై బయలుదేరాడు. మధ్యాహ్నం 44వ జాతీయ రహదారిపై గల శాఖాపూర్ స్టేజీ సమీపంలోకి రాగానే ఆగిఉన్న డీసీఎంను వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లి సావిత్రమ్మ మృతుడి చిన్నతనంలో మృతిచెందగా తండ్రి దేవేంద్రప్ప ఏడాది క్రితం మృతిచెందాడు. మృతుడి చిన్నాన్న హరినాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



◄ పవన్‌సాయి నవీన్‌కుమార్ (ఫైల్)



కాలిపోయిన నిమ్మచెట్ల వద్ద రైతు ఓబులేసు

నిమ్మచెట్లు దగ్ధం

యాడికి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కత్తిమానుపల్లిలో ఓబులేసుకు చెందిన పొలంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బుధవారం మంటలు చెలరేగి.. 60 నిమ్మచెట్లు కాలిపోయాయి. తోటలో వెళ్లిన 11 కేవీ విద్యుత్‌వైర్లు షార్ట్ సర్క్యూట్ కావడంతో నిప్పులు గడ్డిపై పడటంతో మంటలు చెలరేగినట్లు ఆయన వాపోయారు. ప్రమాదంతో సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు తెలిపాడు.

స్టార్టర్ పెట్టె కాల్చివేత

యాడికి, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): ప్రజల తాగునీటి కోసం ఏర్పాటు చేసిన బోరుబావి స్టార్టర్ బాక్స్‌ను దుండగులు కాల్చివేసిన సంఘటన మంగళవారం రాత్రి యాడికిలో జరిగింది. యాడికిలోని పిన్నేపల్లిరోడ్డులోని హౌసింగ్‌కాలనీలో ప్రజల తాగునీటి అవసరాల కోసం బోరుబావి ఏర్పాటుచేశారు. అక్కడే స్టార్టర్ బాక్స్‌ను ఏర్పాటుచేశారు. మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు స్టార్టర్ బాక్స్‌ను ఊడదీసి కాల్చివేశారు. దీంతో కాలనీవాసులు తాగునీటి కోసం ఇబ్బందులు పడ్డారు. సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే కొత్త స్టార్టర్ బాక్స్‌ను ఏర్పాటు చేశారు. దుండగుల ఆగడాలపై తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


HAPPY BIRTHDAY
నీ రాకతో... నియోజకవర్గం తలెత్తుకుంది.
నీ శ్వాసతో... ప్రశాంతత ఊపిరి పోసుకుంది.
నీ నాయకత్వం మరీ మరీ కావాలన్నా...
వెనుక బడిన నేలకు వెంకన్న పంపిన దూతవన్నా...
రాయదుర్గం శాసనసభ్యులు
గౌరవనీయులు
శ్రీ కాలవ శ్రీనివాసులు గారికి
హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.
ప్రజలకు విజయదశమి
శుభాకాంక్షలు
టి.శ్రీమన్నారాయణ
ఎ.రామాంజినేయులు
కె.రమేష్‌రాజు
టి.లక్ష్మీవరప్రసాద్
టి.సాయిబాలాజీ


జన్మదిన శుభాకాంక్షలు
చిరునవ్వుతో... పలకరిస్తూ...
చిరకాలం నిలిచే పనులు చేసి
అందరి మంచి కోరే ఆత్మీయుడు
రాయదుర్గాన్ని ప్రగతి మార్గం
పట్టించిన దార్శనికుడు...


జన్మదిన శుభాకాంక్షలు
అవధులులేని అభివృద్ధి సూత్రం, అన్ని రంగాలలో రాయదుర్గం గాత్రం
ప్రగతి ప్రణాళికకు వాస్తవ సోత్రం కాలవ శీనన్న నేతృత్వంలో
మహాప్రస్థానం మా ప్రియతమ నాయకుడు రాయదుర్గం
శాసనసభ్యులు గౌరవనీయులు
ఇవే మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.


ప్రజా సమస్యలపై అక్షర సత్యాలను ప్రచురిస్తున్న
ఆంధ్రజ్యోతి కి 23rd ANNIVERSARY వార్షికోత్సవ
శుభాకాంక్షలు
with Best Compliments from
NAVAYUGA
Navayuga Engineering Company Ltd.
AN ISO 9001-2008 (QMS), ISO 14001-2004(EMS) & IS 18001-2007(OHSMS) COMPANY
SPECIAL FOUNDATIONS / MARINE STRUCTURES / IRRIGATION PORTS /POWER / DAMS / ROADS / BRIDGES / METROS / SEZs
Corp. Office : 379, Road No. 10, Jubilee Hills, Hyderabad - 500033, Te:+91-40-44557789,
Fax: 040-23337789, Email: nec@navayuga.com